ప్రజాశక్తి

ఆదివారం 16 జూన్ 2024   8 పేజీలు



గుంటూరు



పల్నాడు



నీళ్లులేక వట్టిపోయిన పులిచింతల

ఖరీఫ్ పై సందిగ్ధం

- పెరిగిన వేడిగాలులు
- చాలీచాలని వర్షాలతో అయోమయం
- జలాశయాల్లో నీరు లేక సాగుపై రైతుల్లో మీమాంస

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు,పల్నాడు జిల్లాల్లో గత నాలుగు రోజులుగా వేడిగాలులు పెరిగాయి. ఎండ తీవ్రతతో మళ్లీ

ఉక్కపోత పెరగడంతో ప్రజలు అల్లాడుతున్నారు. నైరుతీ రుతుపవనాల ప్రభావం వల్ల అడపాదడపా ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదు అవుతున్నా సేద్యానికి అనుకూలమైన పరిస్థితులు లేవని రైతులు వాపోతున్నారు. ఈనెల ఒకటో తేదీ నుంచి రెండు జిల్లాల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగా కొన్ని మండలాల్లో వర్షపాతం ఆశాజనకంగా ఉండగా మరికొన్ని మండలాల్లో సాధారణం కన్నా తక్కువ గానే నమోదు అయింది. జూన్‌నెలలో గుంటూరు జిల్లాలో 97.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా మొదటి పక్షం రోజుల్లో 66.7 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయింది. జిల్లాలో 9 మండలాల్లో నిర్ణీతవర్షపాతం కన్నా ఎక్కువ నమోదు అయిందని, మరో ఆరు మండలాల్లో సాధారణ స్థాయిలో వర్షపాతం నమోదు అయిందని అధికారులు తెలిపారు. దుగ్గిరాల,కొల్లిపర,తాడేపల్లి మండలాల్లో కనీస వర్షపాతం నమోదు కాలేదు. పల్నాడు జిల్లాలో వర్షపాతం ఆశాజనకంగా ఉన్న వేడిగాలుల వల్ల సాగు బడి సాగడం లేదు. జిల్లాలో మొదటి పక్షం రోజుల్లో 38.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 58.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసిందని అధికారులు తెలిపారు. అయితే కనీస వర్షపాతం నమోదు కాని మండలాల్లో దుర్గి, గురజాల, అమరావతి, నకరికల్లు, చిలకలూరిపేట,నాదెండ్ల, ముప్పాళ్ల, నర్సరావుపేట, రొంపిచర్ల, ఈపూరు, శావల్యాపురం, నూజెండ్ల,బొల్లాపల్లి, వినుకొండ, మండలాలు ఉన్నాయి. మరో వైపు జలాశయాల్లో నీటి నిల్వలు చాలా తక్కువగా ఉండటంతో ఖరీఫ్ సాగు ఎప్పటికి

2లో

జోరుగా గంజాయి రిటైల్ విక్రయాలు

మూలాల నియంత్రణపై పట్టించుకోని యంత్రాంగం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పలు ప్రాంతాల్లో నిందితులను పట్టుకుని నిల్వలను స్వాధీనం చేసుకుంటున్న పోలీసు యంత్రాంగం వీటి మూలలను తెలుసుకుని శాశ్వతంగా నిర్మూలించే ప్రక్రియను చేపట్టడం లేదన్న విమర్శలు పెద్ద ఎత్తున వస్తున్నాయి.



పల్నాడు జిల్లా సరిహద్దులో స్వాధీనం చేసుకున్న గంజాయి నిల్వలు

తాజాగా పల్నాడు జిల్లా నాగార్జున సాగర్ చెక్‌పోస్టు వద్ద రెండు రోజుల క్రితం 32 కిలోల గంజాయి నిల్వలను పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురిని అరెస్టు చేశారు. వీరితో పాటు మరో ఆరుగురు ఈ కేసులో నిందితులుగా ఉన్నట్టు గుర్తించారు. రంపచోడవరం ప్రాంతానికి చెందిన ముగ్గురు వ్యక్తులు విశాఖ జిల్లాకు నుంచి గంజాయి నిల్వలు తీసుకుని కర్నాటకకు గంజాయి రవాణా చేస్తుండగా తెలంగాణ సరిహద్దులో పోలీసులు గుర్తించారు. ఇటీవల ఒరిస్సా నుంచి తెనాలికి గంజాయిని సరఫరా చేస్తున్న 8 మంది సభ్యుల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. రెండు కిలోల సరుకు స్వాధీనం చేసుకున్నారు. గత రెండునెలలుగా పోలీసులు పూర్తి స్థాయిలో ఎన్నికల విధుల్లో నిమగ్నం అయి ఉండటంతో గంజాయి సరఫరా దారులు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి భారీ సరుకు తరలించారు. ప్రధానంగా ఉమ్మడి విశాఖ జిల్లా నర్సీపట్నం, పాడేరు డివిజన్ల నుంచి తరచూ గంజాయి ఇతర ప్రాంతాలకు రవాణా అవుతోంది. రాష్ట్రంలో ఏప్రాంతంలో గంజాయి విశాఖ జిల్లా నుంచే మూలాలు దొరుకుతున్నాయి. కానీ పోలీసు ఉన్నతాధికారులు గంజాయి సాగు, రవాణా, విక్రయంపై నియంత్రణ చేయలేకపోతున్నారు. రవాణ, విక్రయంపై మొక్కుబడి చర్యలు తప్ప కట్టుదిట్టమైన చర్యలు లేకపోవడం వల్ల యువత మత్తుకు బానిసలవుతున్నారు. అలాగే ఉన్నత కళాశాలల వసతి గృహాల విద్యార్థులకు కూడా విక్రయదారుల వల విసురుతున్నారు. వీరిని గుర్తించి కళాశాల విద్యార్థులు ఈ మత్తుకు బానిస కాకుండా చూడాల్సిన యంత్రాంగం మొక్కుబడి చర్యలతో చేతులు దులుపుకొంటుందన్న విమర్శలు ప్రభలంగా విన్పిస్తున్నాయి. అంతేగాకుండా ఇటీవల కాలంలో విశాఖ జిల్లా నుంచి కిలోల లెక్కన గంజాయి నిల్వలు తీసుకు వచ్చి జిల్లాలో గ్రాముల లెక్కల విక్రయించే వ్యక్తులు పెరిగిపోయారని చెబుతున్నారు. గత ఐదేళ్ళలో ఈ విక్రయాలపై నియంత్రణ కొరవడింది. గతంలో ఎక్కడో మారు

2లో

వైద్య రంగంలో పరిశోధనలు పెంచండి

పిజి లు ప్రధాన భూమిక వహించాలి : సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వైద్య రంగంలో పరిశోధనలు మరింతంగా విస్తృతంగా జరగాల్సిన అవసరం ఉందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ చెప్పారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో ఫార్మకాలజి విభాగం ఆధ్వర్యంలో శనివారం గుడ్ క్లినికల్ ప్రాక్టీస్ (జిసిపి) వర్క్ షాప్ జరిగింది. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ మన దేశం మెడికల్ రంగంలో పరిశోధనలు జరిగితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ప్రస్తుతం పరి శోధనలు ప్రాథమిక దశలోనే ఉన్నాయన్నారు. ప్రపంచ దేశాలు పరిశోధనలకు ఎంతో ప్రాముఖ్యత ఇస్తున్నారని ఆయన అన్నారు. మన ఆధునిక పరికరాలు, మందులకు పరిశోధన అంది పుచ్చుకోవాలన్నారు. అవసరమైన ల్యాబ్ లు, పరికరాలు, సిబ్బంది కూడా ఎక్కువగా ఉన్నప్పుడు సాధ్యమవుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిశోధనలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అయన అన్నారు. పరిశోధనలు జరగడం వల్ల రోగులకు ఆధునిక వైద్యం అందు బాటులోకి వస్తోందన్నారు. పరిశోధనలు చేయడం వల్ల ల్యాప్రోస్కోపి, ఏండో స్కోపి ఆధునిక ఆపరేషన్లు చేస్తున్నారని అయన గుర్తు చేసారు. ఆ కోణం లో పరిశోధనలు జరిగితే అద్భుత ఫలితాలను రాబట్టుకోవచ్చాన్నారు. పరిశోధనలు జరగక పోతే మనిషి మనుగడ కె ప్రమాదం

2లో



మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

బక్రీద్ సందర్భంగా పటిష్ట బందోబస్తు

పల్నాడు జిల్లా ఎస్‌పి మల్లికా గర్గ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



బక్రీద్ పండుగ సందర్భంగా పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రధాన మసీదులు, ఈద్గాల వద్ద కట్టు దిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పల్నాడు ఎస్పీ మల్లికా గర్గ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మత పెద్దలతో సమావేశమైన ఎస్పీ మతసామ రస్యాన్ని కాపాడుతూ, శాంతిభద్రతల పరి రక్షణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రశాంత వాతావరణంలో సుఖ సంతోషాల నడుమ ముస్లిం సోదర సోదరీమణులు వారి కుటుంబ సభ్యులతో బక్రీద్ పండుగ జరుపు కోవాలని ఆకాంక్షిస్తున్నట్లు ఎస్‌పి పేర్కొన్నారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని, ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండగ జరుపుకునే విధంగా జిల్లా వ్యాప్తంగా పటిష్ట భద్రత ఏర్పాటు

2లో



డిఎస్‌సి అభ్యర్థులతో భారీ ర్యాలీ

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

ఎన్నికలల్లో ఇచ్చిన హామీల అమలుకు సిఎం చంద్రబాబు నాయుడు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని గుంటూరు పశ్చిమ శాసనసభ్యురాలు గళ్ళా మాధవి అన్నారు. సిఎంగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే మెగా డిఎస్‌సి నోటిఫికేషన్‌కు చంద్రబాబు సంతకం చేశారని ఆమె చెప్పారు. ఇందుకు సిఎంకు కృతజ్ఞతలు తెలియచేస్తూ శనివారం గుంటూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. నారా చంద్రబాబు నాయుడు కృతజ్ఞతలు తెలియ జేస్తూ డిఎస్సి అభ్యర్థులు, తెలుగుయువత విద్యార్థులతో కలిసి గుంటూరు పశ్చిమ శాసస సభ్యురాలు గళ్ళా మాధవి అంబెడ్కర్ సర్కిల్ లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి అంతరం థాంక్యూ సిఎం సార్ పేరుతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ఇచ్చిన మాట కోసం టిడిపి కూటమి రాష్ట్రంలో విజయం సాధించగానే నిరుద్యోగులకు ఇచ్చిన హామీ అమలుకు బాట వేశారన్నారు. ఎన్నికల చెప్పిన హామీలను బాధ్యతలు స్వీకరించిన వెంటనే మొదటి 5 ఫైళ్ల పైన ఎపి ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై రెండో సంతకం, పెన్షన్ల పెంపుపై మూడో సంతకం,అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణపై నాలుగో సంతకం, స్కిల్ సెన్సెస్ (గణన)

2లో



మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ

వైద్యాధికారులకు ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక మెడికల్ కాలేజిలోని ఎస్‌పియం గ్యాలరీలో వైద్యాధికారులు, యంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్యకార్యకర్తలకు ఏర్పాటు చేసిన మూడు రోజుల సబ్ డిస్ట్రిక్ట్ లెవల్ క్యాన్సర్ స్క్రీనింగ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ముగిసింది.ముగింపు కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ శిక్షణ పొందిన వారు ఆగస్టు మాసంలో జరగబోయే ఇంటింటి సర్వేలో క్యాన్సర్ వ్యాధి లక్షణాలకు సంబంధించి ఆరు ప్రశ్నల పత్రాన్ని తీసుకెళ్లి, గృహసందర్శనలో ప్రశ్నలు అడిగి, వారి సమాధానాలకు అనుగుణంగా అనుమానాస్పద క్యాన్సర్ కేసులను గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రిఫర్ చేస్తారన్నారు. అక్కడ వైద్యాధికారి వారిని పరీక్షించి, అవసరాన్ని బట్టి అనుమానాస్పద కేసులను, తృతీయ శ్రేణి ఆసుపత్రికి రిఫర్ చేస్తారని, అక్కడ క్యాన్సర్‌గా నిర్ధారణ అయిన కేసులకు చికిత్స చేసి, తర్వాత కార్యాచరణ నిర్ణయిస్తారన్నారు. ఈ శిక్షణలో ఎన్‌సిడి ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు, శిక్షకులు డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ హేమంత్, డాక్టర్ తేజ, గర్భకోశ వ్యాధి నిపుణులు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ అనూష పాల్గొన్నారు.



విద్యార్థికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-తాడేపల్లి

చదువుకు ఆర్థిక పరిస్థితి ఆటంకం కాకూడదని ఓ విద్యార్థి చదువు కోసం ఆర్థిక సాయం చేసి తమ దాతృత్వాన్ని సాయికుమార్, తేజవిష్ణులు చాటుకున్నారు. తాడేపల్లి నులకపేటకు చెందిన పదో తరగతిలో దుర్గాప్రసాద్ అత్యుత్తమ మార్కులు సాధించారు. ఆపై ఉన్నత చదువులు చదవడానికి ఆర్థిక పరిస్థితులు అనుకూలించలేదు. తల్లిదండ్రులు లేని దుర్గాప్రసాద్ తన మావయ్య ఇంటి వద్దనే ఉంటున్నాడు. విద్యార్థి ఇబ్బందిని స్థానిక రామ్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ పలగాని శ్రీనివాసరావు దృష్టికి వచ్చింది. వెంటనే ఆయన తనకు పరిచయం ఉన్న శివన్నారాయణ కుమారులు సాయికుమార్, తేజవిష్ణులకు విషయం చెప్పారు. వారు స్పందించి దుర్గాప్రసాద్‌కు రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు.



ఆక్రమిత స్థలాలను పరిశీలించిన రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి- తాడికొండ

మండలల పరిధిలోని లాం గ్రామంలో ఆక్రమణకు గురైన విలువైన ప్రభుత్వ స్థలాలను రెవెన్యూ అధికారులు శనివారం పరిశీలించారు. గత ప్రభుత్వ హాయంలో కొందరు ప్రబుద్ధులు అధికారాన్ని అడ్డం పెట్టుకొని ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి ఇళ్ల నిర్మించారు. దీనిపై గ్రామానికి చెందిన కొందరు గ్రీవెన్స్‌లో కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. విషయం పోలీసుల దృష్టికి సైతం వెళ్ళింది. ఎన్నికలు రావడంతో కొంత జాప్యం జరిగింది. స్థానిక తహసీల్దార్ మోహన రావుకు ఫిర్యాదు అందడంతో ఆక్రమణకు గురైన స్థలాలను పరిశీలించారు. ఆక్రమణకు గురైన స్థలాలను తొలగిస్తామని త్వరలో చర్యలు చేపడతామని తహసీల్దార్ తెలిపారు. తహసీల్దార్ వెంట వీఆర్వోలు నూతక్కి వేణుబాబు ,బ్రహ్మయ్య పాల్గొన్నారు.

మరో ప్రపంచపు మహాకవి శ్రీశ్రీ

రచయిత సి.ఎస్.ఆర్.ప్రసాద్, మాణిక్య వరప్రసాద్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



మరో ప్రపంచపు మహాకవి శ్రీ శ్రీ అని మాజీ మంత్రి డొక్కా మాణిక్యరావు సార్ విప్లవ రచయితల సంఘం సీనియర్ నాయకులు సి.ఎస్.ఆర్.ప్రసాద్ లు పేర్కొన్నారు. శనివారం ఉదయం స్థానిక బ్రాడీపేట లోని 4వలైనులో ఒక హోటల్‌లో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ - జాషువా - పూలే - పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కవి, జర్నలిస్ట్ బి.విల్సన్ అధ్యక్షతన మహాకవి శ్రీశ్రీ 41వ వర్ధంతి సభ జరిగింది. తొలుత శ్రీశ్రీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో మేరు పర్వతం లాంటి మహాకవి శ్రీశ్రీ అన్నారు. మహాకవి శ్రీశ్రీ కార్మిక, కర్షక, పేద ప్రజల కోసం తమ సమాజ స్థాపనే ధ్యేయంగా అవిశ్రాంతంగా కవిత్వాన్ని రాశాడని తెలిపారు. మహాప్రస్థానం, మరో ప్రస్థానం, సిప్రాలి వంటి కవిత్వ పుస్తకాలు, కథలు, అనువాద కవిత్వం, స్వీయ చరిత్ర ఆయన రచనల్లో ప్రామాణికమైనవన్నారు. ప్రత్యేకించి ఖడ్గసృష్టి వంటి కవితల పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిందని గుర్తు చేశారు. సభలో వక్తలు శ్రీశ్రీ కవితలు చదివి వినిపించారుఈ కార్యక్రమంలో త్రిపురనేని సాహితీ సమితి సభ్యులు చెరుకూరి సత్యనారాయణ, జొన్నలగడ్డ రామారావు, వీసీకే జయసుధ, కోలా నవజ్యోతి, గాయకులు జెట్టి బాబురావు, తాటికొండ నరసింహారావు, తిరువల్లూరి పద్మ, సాధు మాల్యాద్రి, నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజ మోహన్ పాల్గొన్నారు.

గుండెజబ్బు రోగికి అరుదైన చికిత్స

ఇంట్రాకార్డియక్ డిఫిట్రలేటర్ పరికరాన్ని అమర్చిన గుండె వైద్య నిపుణులు

వివరాలు వెల్లడించిన సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిది



రోగితో వైద్య బృందం

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి లో ప్రప్రథమంగా గుండె జబ్బు వైద్యులు ఓ రోగి కి అరుదైన ఆపరేషన్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ శనివారం మీడియాకు వెల్లడించారు. కోనసీమ జిల్లా అమలాపురం కు చెందిన ఓ రోగి (ఆనంద్) గుండె జబ్బు వ్యాధి తో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి గత నెల 22 వ తేదీన అత్యవసర విభాగానికి వచ్చాడని అక్కడ గుండె జబ్బు వైద్యులు వివిధ పరీక్షలు చేసి పోస్ట్ క్యాద్ లో చేర్పించారని ఆయన చెప్పారు. పేషంట్ గుండె కు షాక్ ట్రీట్మెంట్ ఇచ్చే ఇంట్రా కార్డియాక్ డిఫీట్రలెటర్ అనే ఆధునిక పరికరాన్ని గుండె లోపల అమర్చాల్సి ఉంది. ఈ పరికరాన్ని సకాలంలో అమర్చక పోతే అకాల మరణం సంభవించె అవకాశం ఉందన్నారు. ఈ పరికరం గుండె లోపల అమర్చాలంటే కనీసం నాలుగు లక్షలు ఖర్చు అవుతుంది. అందుకు అవసరమైన ఆపరేషన్ చేయాలంటే మరో అయిదు లక్షలు ఖర్చు అవుతుందని ఆయన అన్నారు. ఈ ఆపరేషన్ కు దాదాపు 12 నుంచి 15 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పడంతో పేషంట్ సతీమణి పుష్పలీల కన్నీళ్ల పర్యంతమై దిక్కు తోచని స్థితిలో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారని ఆయన చెప్పారు. ప్రైవేట్ ఆసుపత్రుల చుట్టూ తిరిగారని ఫలితం కనిపించలేదన్నారు. చివరగా తన కార్యాలయం లో పేషంట్ సతీమణి కల్సి బాధను వ్యక్తం చేసారని అయన అన్నారు. ఈ పరికరం కొనుగోలు కు ఆరోగ్య శ్రీ లో ఉన్నప్పటికీ ప్రభుత్వ ఆసుపత్రిలో అమలు చేయలేదు. అందుకు కారణం పరికరం ఖర్చు నాలుగు లక్షలు అవుతుందన్నారు. ఈ విషయాన్నీ తాను గమనించి వెంటనే ఆరోగ్య శ్రీ సి ఈ ఓ, , జిల్లా కో ఆర్డినేటర్ లతో మాట్లాడి వారికి అనుమతి కోసం లేఖను పంపించినట్లు అయన చెప్పారు. పేషంట్ పరిస్థితిని గమనించి వెంటనే జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి కు తెలియచేసినట్లు అయన చెప్పారు. ఈ పరికరాన్ని అమర్చేందుకు ఉన్నతస్థాయి అధికారులందరూ పెద్ద మనస్సు తో స్పందించి గుండె లో ఈ పరికరాన్ని అమర్చేందుకు అనుమతి ఇచ్చారని అయన వివరించారు. ఈ పరికరాన్ని వెంటనే తెప్పించి గత బుధవారం యాంజియోగ్రామ్ ద్వారా పరికరాన్ని పేషంట్ గుండెలో అమర్చినట్లు అయన చెప్పారు. ప్రస్తుతం పేషంట్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఈ పరికరాన్ని తాత్కాలికంగా అమర్చిన భవిష్యత్ లో గుండె మార్పిడి ఆపరేషన్ జరగాల్సిన అవసరం ఉందని అయన అన్నారు. మొట్టమొదటిసారిగా ఈ ఆపరేషన్ ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిందని ఖరీదైన ఆపరేషన్ ఉచితంగా చేసినట్లు అయన తెలిపారు. ఈ అపరేషన్ కు అనుమతి ఇచ్చిన ఆరోగ్య శ్రీ సి ఈ ఓ , జిల్లా కలెక్టర్ లకు అయన కతజ్ఞతలు తెలిపారు. ఆపరేషన్ విజయవంతం చేసిన గుండె జబ్బు వైద్యుల విభాగం హెచ్ ఓ డి డాక్టర్ శ్రీకాంత్ బందానికి ఆయన అభినందనాలు తెలిపారు. ఈ కేసు ను జీవనాధార లో నమోదు చేసుకుని భవిష్యత్ లో గుండె మార్పిడికి ప్రయత్నం చేస్తామని అయన అన్నారు. పేషంట్ సతీమణి ... చావు బ్రతుకుల మధ్య ఉన్న తన భర్త కు సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, గుండె జబ్బుల వైద్యులు డాక్టర్ శ్రీకాంత్ లు ప్రాణం పోశారని అన్నారు. అదేవిధంగా ఆరోగ్య శ్రీ సి ఈ ఓ , జిల్లా కలెక్టర్ కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఆపరేషన్ లో డాక్టర్ రాజేంద్ర, డాక్టర్ శివశంకర్ పాల్గొన్నారు.

డిఎస్‌సి అభ్యర్థులతో భారీ ర్యాలీ

(మొదటి పేజీ తరువాయి)

పై ఐదో సంతకం చేశారన్నారు. జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కష్ణ మాట్లాడుతూ "జాబులు ఇచ్చేది బాబే - జాబులు తెచ్చేది బాబే "అంటూ థాంక్యూ సీఎం సార్ అంటూ తెలుగుయువత జిల్లా అధ్యక్షులు రావిపాటి సాయి కష్ణ పెద్ద ఎత్తున నినాదాలు చేసారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరావు,బిజెపి జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్ర,జోన్ -5 ఇంచార్జ్ కోవెలమూడి రవీంద్ర,అర్బన్ టిడిపి అధ్యక్షులు డేగల ప్రభాకర్, గుంటూరు పశ్చిమ పరిశీలకులు సింహాద్రి కనకాచారి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహన్ కష్ణ,కార్యదర్సులు సుఖవాసి శ్రీనివాసరావు ,జిల్లా టిడిపి అధికార ప్రతినిది దామచర్ల శ్రీనివాస రావు, అర్బన్ టిడిపి ప్రధాన కార్యదర్శి ముత్తినేని రాజేష్ తదితరులుపాల్గొన్నారు.

వైద్య రంగంలో పరిశోధనలు పెంచండి

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందని అయన హెచ్చరించారు. కొత్త జబ్బులకు కూడా మందులను కనిపెట్టలేకపోవచ్చని అయన అన్నారు. అలాగే పదాలజి లో పెను మార్పులకు పరిశోధనలు కారణమని అయన గుర్తు చేసారు. ప్రస్తుతం ఓపెన్ బ్యాపిప్స్ స్థాయిలో నే ఉన్నామని ఆయన అన్నారు. ఇంకా మనకు ఫ్రోజెన్ సెక్షన్ పరీక్షలు జరగడం లేదన్నారు. ప్రపంచ వ్యాప్తంగా లిక్విడ్ బయప్స్ చేస్తున్నారని అయన తెలిపారు. 2 సి సి రక్తం తీసుకుని క్యాన్సర్ సంబంధిత పరీక్షలను గుర్తించే పక్రియ జరుగుతోందన్నారు. ఈ విషయాలన్నింటిని పి జి లు అందిపుచ్చుకొని ప్రపంచ స్థాయికి ఎదగాలని అయన ఆకాక్షించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి టి కె రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ప్రభాకర రావు, డాక్టర్ శ్రీధర్ , డాక్టర్ సోమశేఖర్ , డాక్టర్ శంకర్ లు పాల్గొన్నారు.

బక్రీద్ సందర్భంగా పటిష్ట బందోబస్తు

(మొదటి పేజీ తరువాయి)

చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా గో సంరక్షణ చట్టం-2017 అమలులో ఉందని గోవులను ఒక చోట నుండి మరొక చోటుకు తరలించే క్రమంలో తగిన పత్రాలను కలిగి ఉండాలని గోవులను వధించడం పూర్తిగా నిషిద్ధమన్నారు. చట్టాన్ని ఉల్లంఘించినవారిపై చట్ట ప్రకారం కఠిన శిక్ష పడేలాగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా సరిహద్దుల వద్ద చెక్పోస్టులను ఏర్పాటు చేసి గోవుల రవాణాపై నిరంతరం గట్టి నిఘా పెంచడం జరిగిందన్నారు. మత సామరస్యానికి భంగం కలిగించే విధంగా ఎవరైనా రెచ్చగొట్టే ప్రసంగాలు చేసిన సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టిన కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. బక్రీద్ సందర్భంగా జిల్లాలో ఏదైనా అవాంఛనీయ సంఘటనలు ఉత్పన్నమయ్యే పరిస్థితులు ఉంటే, ప్రజలు వెంటనే అప్రమత్తమై పల్నాడు జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ (నెంబర్ 9440796184) కు సమాచారం ఇవ్వాలన్నారు.

జోరుగా గంజాయి రిటైల్ విక్రయాలు

(మొదటి పేజీ తరువాయి)

మూల ప్రాంతాల్లో విక్రయించే వారు. ఇప్పుడు పట్టణాలు, నగర నడిబొడ్డున విక్రయించే వారి సంఖ్య పెరుగుతోంది. కిలో రూ. 2 వేల నుంచి రూ.3 వేలకు తీసుకువచ్చి 10 గ్రాములు రూ.100కి విక్రయిస్తున్న ముఠాలు పెరిగాయి. గత కొన్ని రోజులుగా గంజాయి రిటైల్ వ్యాపారం స్థాయికి వెళ్లిందని చెబుతున్నారు. సరఫరా, విక్రయదారులను నియంత్రించడంపై పట్టు కోల్పోయిన యంత్రాంగం పంట పండించే వారిని, నిల్వ చేసి సరఫరా చేసే వ్యక్తులను పట్టుకుని నియంత్రించడం ద్వారా మూలలపై దెబ్బకొట్టనంత కాలంగా ఈ వ్యాపారం జోరుగా సాగుతూనే ఉంటుందంటే అతి యోశక్తి కాదు.

ఖరీఫ్ పై సందిగ్ధం

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభం అవుతుందనేది అధికారులు చెప్పలేకపోతున్నారు. రైతులు కూడా అయోమయంలో ఉన్నారు. ప్రధానంగా డెల్టా కాల్వలకు పులిచింతల నుంచి ఇప్పట్లో నీరు విడుదల కావాల్సిఉంది. పులిచింతల జలాశయం గరిష్ట నీటి వల్ల 45.77 టిఎంసీలు కాగా శనివారం సాయంత్రంకు 0.75 టిఎంసిలు మాత్రమే నీటినిల్వ ఉంది. ప్రధానంగా శ్రీశైలంలో గరిష్ట నీటి నిల్వ 215.80 టిఎంసిలు కాగా ప్రస్తుతం 34.79 టిఎంసీలు మాత్రమే ఉంది. నాగార్జున సాగర్‌లో గరిష్ట నీటినిల్వ 312.01 టిఎంసిలుకాగా ప్రస్తుతం 122.69 టిఎంసీలు మాత్రమే నిల్వ ఉన్నాయి. మొత్తంగా ప్రధాన జలాశయాల్లో కనీస నీటి నిల్వలు లేకుండా పోతున్నాయి. నాగార్జున సాగర్,శ్రీశైలంలో నీటి నిల్వ డెడ్ స్టోరేజికి చేరుకున్నాయి. జలాశయాల్లో నీటి నిల్వలు లేకుండా సాగుపై రైతులు ముందడుగు వేయలేకపోతున్నారు. జిల్లాలో 4 లక్షల ఎకరాల్లో, పల్నాడు జిల్లాలో ఏడు లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయాల్సిఉంది. ఇప్పటి వరకు నాలుగు వేల ఎకరాల్లో ఆరుతడి పంటలువేశారని అధికార వర్గాలు తెలిపాయి.

ఆత్మహత్యకు యత్నించిన కాంట్రాక్టు ఉద్యోగి మృతి

ప్రజాశక్తి - రెంటచింతల



ఇస్లావత్ సేవా నాయక్

మండలంలోని సత్రశాల వద్ద కష్ణా నదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టైల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్ట్ లో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తున్న ఇస్లావత్ సేవా నాయక్ శనివారం ఉదయం గుంటూరు లోనే సమగ్ర ప్రభుత్వ వైద్యశాలలో మృతి చెందాడు. సివిల్ విభాగము నుంచి మెకానికల్ విభాగానికి మార్చమని పలుమార్లు కోరగా ఉన్నతాధి కారులు అంగీకరించినా, సెక్షన్ అధికారి అంగీ కరించకపోవ డంతో మనస్థాపం చెంది గడ్డి మందు తాగి తనువు చాలిం చాడు ప్రాజెక్టు ఎస్ ఈ వెంకటరమణ ఈ ఈ సుబ్రహ్మణ్యం, నాగరాజు యూనియన్ నేతలు, అధి కారులు సంతాపం వ్యక్తం చేశారు తల్లి ముత్యాలమ్మ మతితో కారుణ్య నియామకంతో ఏడేళ్ల క్రితం సేవనాయక్ ఉద్యోగంలో చేరారు. .

ఉండవల్లి సెంటర్‌లో దొంగల హల్‌చల్

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లి సెంటర్‌లో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత దొంగలు హల్‌చల్ చేశారు. రెండు సూపర్‌బజార్‌లు, ఒక మోడల్ డైరీలో రూ.2 లక్షల నగదు దొంగలు ఎత్తుకెళ్లారు. దర్జాగా సూపర్ మార్కెట్ షట్టర్ల తాళాలు పగలగొట్టి దొంగతనాలను పాల్పడినట్లు సిసి టివిలో రికార్డు అయ్యింది. ముగ్గురు యువకులు ఈ దొంగతనాలకు పాల్పడినట్లు తెలుస్తుంది. స్థానికంగా కొంతమంది అనుమానితులపై షాపు యజమానులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సీతా రామాంజనేయ సూపర్ మార్కెట్ రూ.60 వేలు, మోడల్ డైరీ రూ.40 వేలు, ఓ చిల్లర దుకాణంలో రూ.70 వేలు దొంగలు దోచుకెళ్లారు. బాధితులు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుర్గి పిఎస్ హోమ్ గార్డ్ సస్పెన్షన్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మాచర్ల నియోజకవర్గం దుర్గి పోలీస్ స్టేషన్ లో పని చేస్తూ నేరాలకు, బెదిరింపులకు పాల్పడుతున్న హెూం గార్డు మధు ను సస్పెండ్ చేస్తున్నట్లు పల్నాడు ఎస్పీ మల్లికా గర్గ్ శనివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా పోలీసు కార్యాలయం నుండి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మాచర్ల పట్టణ పోలీసు స్టేషన్ లో మధు పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. గౌరవ ప్రదమైన పోలీసు శాఖలో పని చేస్తూ శాంతి భద్రతల ను కాపాడుతూ ప్రజలకు విశేష సేవలు అందించాల్సిన పోలీసులు నేరాలకు పాల్పడితే ఎవరిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

డ్రాయింగ్ మాస్టారు చేసిన 'హ్యాపీ ఫాదర్స్ డే'

ప్రజాశక్తి-పెదరావూరు



ప్రతి ఏడాది జూన్ 3వ ఆదివారం నాడు ఫాదర్స్ డే జరపుకుంటారు. ఈ సందర్భంగా తెనాలి మండలం లోని పెదరావూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ మాస్టార్ పణిదెపు వెంకటకృష్ణ ఎ4 కలర్ పేపర్‌పై విశ్వంపై నిలబడిన తండ్రి, కూతురు, కుమారుని చిత్రాలను బ్లేడ్‌తో కత్తిరించి అతికించారు. తండ్రు లందరికీ హ్యాపీ ఫాదర్స్‌డే అని శుభాకాంక్షలు తెలిపారు.

లారీ డ్రైవర్ ఆత్మహత్య

ప్రజాశక్తి -సత్తెనపల్లి రూరల్

కుటుంబ కలహాల కారణంగా లారీ డ్రైవర్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల సమీపంలో శనివారం జరిగింది. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల కు చెందిన క దగ్గు మురళీ (32) మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మురళీ లారీ డ్రైవర్ గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు.మాచవరం మండలం పిల్లుట్ల కు చెందిన లక్ష్మీ తిరుపతమ్మ తో వివాహం మైంది. భార్య కాన్పు కోసం సంవత్సరం క్రితం పుట్టింటికి వెళ్ళింది. భార్యను కాపురము నిమిత్తము ఎన్ని సార్లు పిలిచినా రాకపోవటంతో మనస్తవంతో మృతుడు ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృత దేహాన్ని నడికూడి రైల్వే పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

దాడి చేసి దోపిడికి పాల్పడే ముఠా అరెస్ట్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

దారి కాచి రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలపై ఒంటరిగా వెళుతున్న వారిని లక్ష్యంగా చేసుకొని దాడి చేసి దోపిడీకి పాల్పడుతున్న దొంగల ముఠాను నరసరావుపేట రూరల్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. మద్యానికి,చెడు వ్యసనాలకు బానిసలై ముఠాగా ఏర్పడిన 25, 26 యువకులైన నిందితులు నరసరావుపేట పట్టణం ఇస్లాంపేటకు చెందిన నెమలికంటి లిటిల్, షేక్ అహ్మద్ హుస్సైన్ అలియాస్ చావపాటి హమేద్ హుస్సైన్, చిలకలూరిపేట పట్టణం పద్మశాలి పేటకు చెందిన అమీరుల్లా, నరసరావుపేట మండలం కేసానుపలి-లలితాదేవి కాలనీకి చెందిన కుందా నిఖిల్ లు అదుపులోకి తీసుకున్నట్లు సిఐ వివరించారు. ఈ నెల 10 న దారి దోపిడికి గురైన బాధితులు నరసరావుపేట పట్టణం ఇస్లాం పేటకు చెందిన షేక్ జిలానీ, నరసరావుపేట మండలంలోని యలమంద గ్రామానికి చెందిన తెలజల రామ కోటయ్య ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు శనివారం వినుకొండ రోడ్డు వై.జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా ఉన్న నేపథ్యంలో విచారణ జరిపిన పోలీసులు నిందుతులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు వీరితో పాటు మరో ఇరువురు యువకులు ఆశ్రఫ్, బాబీ నేరంలో పాల్గొన్నట్లు త్వరలో వారిని కూడా అరెస్ట్ చేస్తామన్నారు. నిందుతులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్.ఐ కె.రోశయ్యను సిబ్బందిని సిఐ అభినందించారు.

భూ యాజమాన్య హక్కు చట్టం రద్దుపై హర్షం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రైతులకు తీవ్ర నష్టం చేసే (ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్) భూ యాజమాన్య హక్కు చట్టం రద్దు చేస్తున్నట్లు ఇటీవల అధికారం చేపట్టి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు నాయుడు చట్టం రద్దు చేస్తూ సంతకం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గుంటుపల్లి బాలకృష్ణ ఏపూరి గోపాల రావులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం తెచ్చిన ఈ చట్టంలో రైతులకు మేలు చేసే అంశాల కంటే కీడు చేసే అంశాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రైతులు ఆందోళనకు గురయ్యారని, దీని దృష్టిలో ఉంచుకొని ఇచ్చిన హామీ మేరకు చట్టాన్ని రద్దు చేయడాన్ని ఆహ్వానిస్తున్నామన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రత్యేకించి పల్నాడు జిల్లా లో నకిలీ, కల్తీ విత్తనాల వల్ల రైతులు గతంలో తీవ్రంగా నష్టపోయారని, ఈసారి అలా జరగకుండా వ్యవసాయ శాఖ పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు.పల్నాడు జిల్లాలో గత రెండేళ్ళుగా సాగు నీరందక మాగాణి భూమి పడావుగా పడి, బీడు భూములుగా మారిపోయిందని, ఇప్పటికైనా సాగునీటి ప్రణాళికను ప్రకటించి మొత్తం భూమి సాగులోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మిర్చిలో బొబ్బర,తామర తెగుళ్లతో దిగుబడి శాతం బాగా తగ్గిపోతుందని, మిర్చి పంటకు దిగుబడి ఆధారిత భీమా అమలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేసి, సంక్షేమ పథకాలు అమలు, పంటల బీమా వర్తించే దానికోసం చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. పల్నాడు జిల్లాలో వినుకొండ, మాచర్ల నియోజకవర్గం లో లక్ష ఎకరాలకు సాగునీరు, వంద గ్రామాలకు తాగునీరు అందించే, వరికపూడిశెల పథకం నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు.

చదువుతోనే ఉన్నత శిఖరాలు

ప్రజాశక్తి -ప్రత్తిపాడు

విద్యార్థులు చదువుతూనే ఉన్నత శిఖరాలను చేరుకోగలరని తెలుగుదేశం పార్టీ ప్రతిపాడు మండల కన్వీనర్ గింజుపల్లి శివరాం ప్రసాద్ అన్నరు. శనివారం ప్రత్తిపాడు మండల పరిధిలోని పాత మల్లయ్య పాలెం లో విద్యార్థులకు విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తు ని చేతుల్లోనే ఉంది మంచి మంచి చదువులు చదివి గ్రామానికి మరియు మండలానికి మంచి పేరు తెచ్చేలా ఉండాలని తద్వారా మీతో పాటు మీ యొక్క కుటుంబాలు కూడా సమాజంలో గౌరవంగా ఉంటాయని అన్నారు. కార్యక్రమం లో అలగే చిన్న కొండ్రుపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో, తిక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో కూడా విద్యార్థులకు విద్యా కానుక కిట్లు ప్రదానం చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న డిఎస్పీ

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి- క్రోసూరు

అర్ధరాత్రి సమయంలో ఇంట్లోకి ప్రవేశించి బంగారు ఆభరణాలు నగదు ఆపరేషన్ కేసులో ముద్దాయిని క్రోసూరు పోలీసులు శనివారం అరెస్టు చేశారు సత్తెనపల్లి డి.ఎస్.పి కార్యాలయంలో నిందితుడిని ప్రవేశపెట్టారు ఈ సందర్భంగా డిఎస్పి జి గురునాథ్ బాబు మాట్లాడుతూ క్రోసూరు మండలం దొడ్లేరు గ్రామానికి చెందిన పోసిపోగు ఆంధ్రబాబు ఇంట్లో కోసూరు మండలం అనంతవరం గ్రామానికి చెందిన జవ్వాది సురేష్ ఉరఫ్ చిన్నాబ్బాయి ప్రవేశించి ట్రంకుపెట్టెలో ఉన్ననగదు బంగారు ఆభరణాలకు అపారించాడు . బంగారు ఆభరణాలతో పాటు సెల్ ఫోన్ కూడా ముద్దాయి ఎత్తెకెళ్ళాడు. ఆంధ్ర బాబు కోసూరు పోలీసులకు జూన్ 13నఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన క్రోసూరు పోలీసులు సెల్ ఫోన్ ఆధారంగా సురేష్ ను అరెస్టు చేసి అతని వద్ద నుండి సుమారు 10లక్షలు విలువైన 156 బంగారు ఆభరణాలు 132గ్రాముల వెండి వస్తువులు 3500నగదు ను స్వాధీనం చేసుకున్నారు. మద్యానికి బానిసైన ముద్దాయి సురేష్ చిన్న చిన్న దొంగతనాలకు పాల్పాడుతుడేవాడని డీఎస్పీ తెలిపారు. ముద్దాయి కోర్టులో హాజరు పరిచినట్లు చెప్పారు . రెండు రోజుల్లో దొంగతనాన్ని ఛేదించిన పోలీసులను డిఎస్పీ అభినందించారు.ఈ సమావేశంలో పెదకూరపాడు సిఐ రంగారావు క్రోసూరు ఎస్సై షఫీ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాగ్స్ నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి -తాడేపల్లి రూరల్: ఎం టి ఎం సి పరిధిలోని చిర్రావూరు గ్రామంలోనీ జిల్లా పరిషత్ హై స్కూల్ నందు శనివారం విద్యార్థిని, విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, నోట్ పుస్తకాలను టిడిపి నాయకుల ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణ శ్రీ, వ్యాయామ ఉపాధ్యాయులు సాంబశివరావు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, బ్రహ్మయ్య,తెలుగుదేశం చిర్రావూరు గ్రామ అధ్యక్షులు వీరిశెట్టి శ్రీనివాసరావు, పి రమేష్, జనసేన పార్టీ నాయకులు సిహెచ్ లాల్చంద్, ఎం.రవి పాల్గొన్నారు.

రాజకీయాల నుండి తప్పుకుంటున్నాననే ప్రచారం తగదు

- **పోలీసు ఆంక్షల నేపథ్యంలో ఇంటికే పరిమితమయ్యాను**
- **మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి**

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

13 ఏళ్ల నుండి రాజకీయాలలో ఉంటూ 10 ఏళ్లు నరసరావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యేగా పని చేశా...రాజకీయాలు కొత్త కాదు ప్రతి పక్షంలో ఉండడం కొత్త కాదు పోలీసు ఆంక్షల నేపథ్యంలో ఇంటికి పరిమితం అయ్యా... ఈ మాత్రం దానికే తాను క్రియాశీలక రాజకీయాల నుండి తప్పుకుంటున్నానని ప్రచారం జరుగుతోందని నియోజకవర్గ ప్రజలకు వైసిపి నాయకులకు కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా తన ఇంటి తలుపులు ఎప్పుడు తెరిచే ఉంటాయని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం గుంటూరు రోడ్డులోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ కొత్త ప్రభుత్వానికి కొంత సమయం ఇస్తున్నామని ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రజల పక్షాన రోడ్డెక్కి పోరాటం చేస్తానన్నారు. వైసిపి నాయకులకు కార్యకర్తలకు అండగా అందుబాటులో ఉంటానన్నారు. తాను వైసిపిని కానీ రాజకీయాలను కానీ వీడేది లేదని రాజకీయాలు నుండి తప్పుకుంటున్నట్లు ప్రచారం చేస్తున్న ఇరు పార్టీల (టిడిపి, కొందరు వైసిపి) నాయకుల విజ్ఞతకే వదిలేస్తున్నట్లు పేర్కొన్నారు. పోలీసు ఆంక్షలు ఈ నెల 20 తో ముగుస్తుందని నిత్యం నియోజకవర్గ ప్రజలతో మమేకం అవుతామన్నారు.



సమీక్షలో పాల్గొన్న అధికారులు

జాతీయ లోక్‌అదాలత్ పై సమీక్ష

ప్రజాశక్తి-గురజాల

ఈ నెల 29న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ పై సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. గురజాల మండలం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు అధ్యక్షతన ఈ సమీక్ష జరిగింది. సమీక్షలో న్యాయవాదులు, బ్యాంక్ అధికారులు, బిఎస ఎన్ఎల్ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు. సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ రాజీ పడదగిన సివిల్,క్రిమినల్ కేసు లను పరిష్కరించటానికి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. ఆయా కేసులలో కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొనేలా పోలీసులు వారికి అవగాహన కల్పించాలని కోరారు. రాజీమార్గంలో కేసును పరిష్క రించుకోవడం ద్వారా వారి సమయం, ధనం వృథా కాకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సత్యనారాయణ,బార్ అసోసియేషన్ న్యాయవాదులు షేక్ జానీ బాషా, ఏవి నాగార్జున, పఠాన్ హుస్సేన్ ఖాన్, ఆచంట శ్రీనివాసరావు, కె.సురేష్, ఎం శ్రీనివాసరావు, గుర జాల, దాచేపల్లి, కారంపూడి, రెంటచింతల పోలీసులు బ్యాంకు, బిఎస్ఎన్ఎల్ అధికారులు పాల్గొన్నారు



పోలీసులతో సమావేశం నిర్వహిస్తున్న న్యాయమూర్తులు

రాజీ మార్గమే రాజ మార్గం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఈ నెల 29తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్ లో సత్తెనపల్లి న్యాయస్థానాల పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్లో రాజీ పడదగిన సెక్షన్లు ఉన్న కేసులు అన్ని పరిష్కారమయ్యేలా చూడాలని సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) , మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్ సిహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు పోలీసులను ఆదేశించారు. సత్తెనపల్లి అగ్రికల్చర్ మార్కెటింగ్ యార్డ్ ఆవరణలో ఉన్న సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి కోర్టు హాల్లో సీనియర్ సివిల్ జడ్జి ఆధ్వర్యంలో సత్తెనపల్లి న్యాయస్థానాల పరిధిలో ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్. ఓ ల సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. న్యాయమూర్తి ముందుగా ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రాజీ పడతగిన కేసులు ఎన్ని ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. న్యాయమూర్తులు, తౌషిద్ హుస్సేన్,పి.ప్రియదర్శిని,మహ్మద్ గౌస్ లు పాల్గొన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 50 శాతం రాయితీపై సరఫరా చేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకుని భూమిలో సూక్ష్మ పోషకాలను, సేంద్రియ పదార్థాలను వద్ధి చేసుకొని ఆరోగ్యకరమైన ఆహారం ఉత్పత్తులు సాధించాలని ఈవోపీఆర్డీ కెవి శివ ప్రసాద్ సూచించారు. శనివారం నాయకులు యాదల మహా నంద రెడ్డి, గంగుల పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో పచ్చిరొట్ట విత్త నాలను పంపిణీ చేశామన్నారు.

నాన్నకు వందనం...

నేడు అంతర్జాతీయ పితృ దినోత్సవం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నాన్న ప్రేమకు ఎల్లలుండవు. పిల్లలకు ఎలాంటి కష్టం తెలియకుండా పెంచి పెద్ద చేసేందుకు పిల్లలకు మంచి జీవితాన్ని ఇచ్చేందుకు తండ్రి పడే కష్టం అంతా ఇంతా కాదు. కుటుంబ అవసరాల కోసం తన సుఖాలను, సంతోషాలను సైతం పక్కన పెట్టి శ్రమిస్తాడు. అలాంటి తండ్రిని కీర్తిస్తూ ప్రతి ఏటా జూన్ నెల 3 వ ఆదివారం పిత దినోత్సవం జరుపుకోవడం ఆన వాయితీగా వస్తుంది. అమెరికాకు చెందిన సోనారా స్మార్ట్ డాడ్ అనే మహిళ కుటంబం కోసమే ఆలోచించే తండ్రి కోసం ఏదైనా చేయాలని ఆలోచించి నాన్న కోసం తొలుత ప్రచారం మొదలు పెట్టారు. దాని ఫలితం గానే 1910 నుండి అంతర్జాతీయంగా పిత దినోత్సవం (ఫాదర్స్ డే) జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. బిడ్డల బాగు కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కన్న తండ్రుల త్యాగాలను గుర్తు చేసుకునేందుకు అంతర్జాతీయ పిత దినోత్సవం ప్రతీ కగా నిలుస్తోందని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నాన్న నుండి నిత్యం నేర్చుకుంటూనే ఉన్నా

గుడిపల్లి మధు, చిలకలూరిపేట




పాదాభివందనం చేస్తున్న మధు

మా తండ్రి సాంబశివరావు నుండి నేను ఎంతో నేర్చు కున్నాను. ఇంకా నేర్చు కుంటూనే ఉన్నాను. వృత్తి పరం గా ఎన్ని ఒడి దుడుకులు ఉన్నా నాతో స్నేహి తుడిలా ఉం టారు. చిన్నతనం నుండి కూడా వృత్తిపరంగా ఎంత పని ఒత్తిడి ఉన్నా తరచూ పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాం తాలకు తీసుకెళ తూ కుటుంబ సభ్యులను ఆహ్లాదపరుస్తూ ఉంటారు. సమాజం పట్ల అవగాహన, క్రమశిక్షణ, సత్ప్ర వర్తన నాన్న దగ్గరే నేర్చుకున్నాను. అదే ప్రేమను నాన్నగా నా బిడ్డకు పంచుతున్నాను. బిడ్డల ఎదుగుదల కోసం పాటు పడిన తల్లిదండ్రులకు వృద్ధాప్యంలో ఆసరాగా ఉండడం ద్వారా మాత్రమే వారి రుణం కొంత తీర్చు కొనేందుకు అవకాశం ఉంటుంది.

నాన్న ప్రేమకు ఎల్లలుండవు. పిల్లలకు ఎలాంటి కష్టం తెలియకుండా పెంచి పెద్ద చేసేందుకు పిల్లలకు మంచి జీవితాన్ని ఇచ్చేందుకు తండ్రి పడే కష్టం అంతా ఇంతా కాదు. కుటుంబ అవసరాల కోసం తన సుఖాలను, సంతోషాలను సైతం పక్కన పెట్టి శ్రమిస్తాడు. అలాంటి తండ్రిని కీర్తిస్తూ ప్రతి ఏటా జూన్ నెల 3 వ ఆదివారం పిత దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితి.

ఆర్థిక ఇబ్బందులున్నా చదివించారు

రాధాకృష్ణ, యు.ఎస్, డెట్రాయిట్



తండ్రి వీరయ్యతో ..

బాపట్ల జిల్లా సంత మాగు లూరుకు చెందిన నేను బిటెక్ పూర్తి చేసిన అనంతరం అమెరికాలో ఎంఎస్ చేసి డెట్రాయిట్‌లో ఉన్నత ఉద్యోగం సాధిం చాను. చదువుకునే రోజు లలో కుటుంబ పరంగా ఆర్థిక ఇబ్బందులు ఉన్న ప్పటికీ ఖర్చులు లెక్కచేయకుండా చదివించి నాకు మంచి జీవి తాన్ని ప్రసాదించారు. ఒకానొక సందర్భంలో పెద్దల నుండి వారసత్వంగా వచ్చిన కొద్దిపాటి పొలంలో కేవలం నా ఉన్నత చదువు కోసం విక్రయించేందుకు సిద్ధ పడ్డ మా నాన్న తాను పడుతున్న కష్టాన్ని మాకు తెలియ నీయకుండా మా సంతోషంలో ఆయన తన ఆనందాన్ని వెతుకున్నారు.



తండ్రిపై ప్రేమను చాటుతూ ఓ యువకుడు తన గుండెపై పచ్చ బొట్టు వేయించుకున్న చిత్రం

నాన్న..అందరికీ ఆత్మబంధువు

నంద్యాల స్టాలిన్ , ఆర్టీసీ కాలనీ, నరసరావుపేట



స్టాలిన్ తండ్రి నంద్యాల కోటి రెడ్డి

మంచికి,మానవత్వానికి మారు పేరు మా నాన్న నంద్యాల కోటిరెడ్డి. వృత్తి పరంగా క్షణం తీరిక లేక పోయినా మా నడవడికను గమ నిస్తూ ఉండేవారు. ఆర్టీసీ ఉద్యోగ విరమణ అనంతరం నాకు, మా అన్న య్యకు ఇప్పటికీ మంచి మాటలు చెబుతారు. తోటి వారికి సహాయ పడ డంతో పాటు నీతి, నిజాయితీకి, క్రమశిక్షణకు నిదర్శనం నాన్న. ఆయన అందరికీ ఆత్మ బంధువు. సేవాదక్పథం ముఖ్యమని ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా జీవించాలని మాకు చెబుతుంటారు.

పిల్లలను పనులకు పంపించవద్దు

ప్రజాశక్తి-క్రోసూరు

గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సంబంధించిన వాల్‌పోస్టర్లను శనివారం క్రోసూరు పోలీస్ స్టేషన్‌లో సిఐ మంగారావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ ఐదేళ్లు నిండిన పిల్లలందరినీ బడికి పంపాలని , పిల్లలను పనులకు పంపించడం చట్టరీత్యా నేరం అని అన్నారు. అదే విధంగా హోటళ్లలో, రెస్టారెంట్లలో, భవన నిర్మాణ పనులలో, మెకానిక్, పెట్రోల్ బంక్ లాంటి వాటిలో పిల్లలను పనిలో పెట్టవద్దని చెప్పారు. గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సుపీరియర్, డైరెక్టర్ సిస్టర్ విన్నరసి మాట్లాడుతూ బాల కార్మి కులుగా ఎవరైనా కనిపిస్తే 1098 ఉచిత టోల్ ఫ్రీ నెంబర్ కి సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఎ.వెంకట్రామి రెడ్డి, వీఆర్వో సైదులు , కానిస్టేబుల్ షణ్ముఖ, ఉపేంద్ర, దాసు, కోసూరు మండల ఇంచార్జ్ టి.లక్ష్మణ, బాబు,పవన్ పాల్గొన్నారు.



బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ చిత్రం



జాబ్‌మేళాలోనియామకపు పత్రాలు స్వీకరిస్తున్న యువతీయువకులు

హెల్ప్ పౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా

ప్రజాశక్తి-సత్తెనపల్లిటౌన్

జీవితానికి చదువే మార్గమని, చదువును, సమయాన్ని సక్రమంగా ఉపయోగించుకున్నప్పుడే ఉన్నత స్థితిలో ఉంటారని కేఎల్ యూనివర్సిటీ అసోసియేట్ డీన్, ఉమెన్ డెవలప్మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ రూత్ రమ్య సూచించారు. సత్తెనపల్లి పట్టణం హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు పట్టణంలోని టీచర్స్ మస్తాన్ ఐటిఐ కళాశాలలో శనివారం జాబ్ మేళా నిర్వహించారు. కార్యక్రమానికి హెల్ప్ ఫౌండేషన్ అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా రూత్ రమ్య హాజరయ్యారు. స్కాలర్స్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ ఇమ్మానుయేలు మాట్లాడుతూ చిన్ననాటి నుంచి చదువుపట్ల మక్కువ కలిగి తక్కువ సమయంలో స్థిరపడినప్పుడు భవిష్యత్తు ఎంతో బాగుంటుందని, తద్వారా కుటుంబానికి, సమాజానికి ఎంతో ఉపయోగపడవచ్చని చెప్పారు. ముందుగా యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులర్పించారు. జాబ్ మేళాకు 210 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. 21మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో

కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు కంబాల శ్రీనివాస్,జర్నలిస్ట్ కె ఉదయ్ భాస్కర్ ,గుంటూరు జిల్లా హెల్ప్ పౌండేషన్ అధ్యక్షు రాలు లక్ష్మీ , పల్నాడు జిల్లా అధ్యక్షురాలు సౌజన్య , సురేష్, బాబీ, నర్మదా,ఐటిఐ ప్రిన్సిపాల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు .

మహాకవి శ్రీశ్రీకి ఘననివాళి

ప్రజాశక్తి- క్రోసూరు

పేద ప్రజల,కర్షకుల, కార్మి కుల గొంతుకై సమస్యలను తన రచనల ద్వారా ఉగ్రూత లూగించిన మహాకవి శ్రీరంగం శ్రీని వాసరావు అని “ది క్రోసూరు యూత్ సర్వీస్ క్లబ్” గౌరవాధ్యక్షులు కొం కాయల వీరాంజనేయరెడ్డి అన్నారు. శనివారం శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. శ్రీశ్రీ ఈ రోజుకి కూడా ప్రజల హదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారని క్లబ్ అధ్యక్షులు



రొంపిచర్ల రామచంద్ర ప్రసాద్ అన్నారు. మహిళా సాధికారతను ,వారి వారి సమస్యలను ఎలుగెత్తి చాటడంలో శ్రీశ్రీని ఆదర్శంగా తీసుకోవాలని షిరిడి సాయిబాబా సంఘ కమిటీ చైర్మన్ మన్నెం వెంకట్రావు అన్నారు. నివాళులర్పించిన వారిలో దళిత నాయకులు దాసు, బీసీ సెల్ నాయకులు బొప్పూడి రమేష్, మామిడి పెద్ద సింగయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి
మంగళగిరి


మున్సిపల్ యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న చంగయ్య

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పెండిగ్ అలవెన్స్ తక్షణం చెల్లించాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ చంగయ్య డిమాండ్ చేశారు. శనివారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ మంగళగిరి పట్టణ కమిటీ సమావేశం స్థానిక సిఐటియు కార్యాలయంలో యూనియన్ పట్టణ అధ్యక్షులు పేరం పూర్ణచంద్రరావు అధ్యక్షత నిర్వహించారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్.చెంగయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. పెండింగ్లో ఉన్న రెండు నెలలు హెల్త్ అలవెన్స్ వెంటనే చెల్లించాలని, సమ్మె కాలం వేతనం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. చెప్పులు, సబ్బులు, నూనెలు, ఇవ్వాలని తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. సమా వేశంలో యూనియన్ పట్టణ ఉపాధ్యక్షులు, యన్నం శివ నాగేశ్వరరావు, కటారి శ్రీనివాస రావు, కటారి పరమేశ్వర రావు, శివరాత్రి అంజిబాబు, ముద్రబోయిన హను మంతరావు, దాసరి సాంబయ్య పాల్గొన్నారు.

అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు


మాట్లాడతున్న రాధ

అంగన్వాడీలకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ కోరారు. శనివారం ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గుంటూరు ప్రాజెక్టు కమిటీ సమావేశం పాత గుంటూరులోని సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజి మాట్లాడుతూ అంగన్వాడీలు గత ప్రభుత్వం హాయంలో జీతాలు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని 42 రోజులు సమ్మె చేస్తే జీతాలు జులైలో పెంచుతామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. ఆ హామీని ప్రస్తుతం అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు. అదేవిధంగా హెల్పర్ పోస్టల ప్రమోషన్లకు సంబంధించి దరఖాస్తు చేసి, ఇంటర్యూకు పిలిచి, ఎన్నికల కోడ్ కారణంగా పోస్టింగ్ ఇచ్చే ప్రక్రియ నిలుపుదల చేశారన్నారు. కావున అటువంటి వారందరికీ వెంటనే పోస్టింగ్స్ ఇవ్వాలన్నారు. అంగన్వాడీ యూనియన్ గుంటూరు ప్రాజెక్టు కార్యదర్శి టి.రాధా మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అన్నారు. అంగన్వాడి సమస్యల పరిష్కారం కోసం జిల్లా అధికారులు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాలని కోరారు. ఈ సమావేశానికి ఆరుమళ్ళ నాగేశ్వరి అధ్యక్షత వహించగా, ప్రాజెక్టు గౌరవ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, ఓ.రోజమ్మ, వెంకటరమణ, శ్రీదేవి, పద్మ, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎంపి నందిగం సురేష్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - తుళ్లూరు

మాజీ ఎంపి నందిగం సురేష్ బాబు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. రాజధాని అమరావతి పరిధిలోని ఉద్దండరాయునిపాలెంలోని ఆయన స్వగృహంలో వైసిపి నాయకులు, అభిమానుల సమక్షంలో సురేష్ బాబు కేట్ కట్ చేశారు. వైసిపి నాయకులు బత్తుల కిషోర్, కొప్పుల శేషగిరిరావు, ఆరేపల్లి జోజి, గంజిమాల కోటేశ్వరరావు తదితరులు సురేష్ బాబుకు జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు.


ఎమ్మెల్యే నసీర్‌కు పూల బొకే అందచేస్తున్న నాయకులు

నసీర్‌కు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అభినందన

ప్రజాశక్తి-గుంటూరు :గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన మొహమ్మద్ నసీర్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్‌కు శాలువా కప్పి, బొకే అందచేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు చాంద్‌భాషా, మహిళా విభాగం సహాధ్యక్షులు హేమలత, షబానాసుల్తానా, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఎపిజిఇఎ కార్యనిర్వాహక కార్యదర్శిగా ఆశా సజిని..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నగర కార్యనిర్వాహక కార్యదర్శిగా ప్రభుత్వ సమగ్ర వైద్యశాల నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా, నగర అధ్యక్షులు నాగేశ్వరరావు, కోశాధికారి శ్రీనివాసరావు, మహిళా విభాగం సహాధ్యక్షులు హేమలత తదితరులు ఆశా సజిని అభినందించారు.

చేగువేరాకు అవగాహన సభ్యుల నివాళి

ప్రజాశక్తి-గుంటూరు



చేగువేరా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అవగాహన సభ్యులు

ప్రపంచ ప్రజలను ప్రభావితం చేసిన విప్లవకారుడు చేగువేరా సమకాలీన వ్యవస్థపై తిరుగు బాటు చేయడమే సమస్యలకు పరి ష్కారం అని నమ్మి పోరాటాలు చేసిన విప్లవ జ్యోతి అని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. శనివారం అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో చేగువేరా జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యావేత్త ఆర్. వి.సింగరయ్య మాట్లాడుతూ అర్జెంటీనా మార్క్సిస్ట్ విప్లవకారుడు, వైద్యుడు, రచయిత, గెరిల్లా నాయకుడు అయిన చేగువేరా క్యూబా విప్లవంలో ప్రముఖ పాత్ర వహించా డన్నారు. అనేక దేశాల్లో పర్యటించి అక్కడున్న ఉన్న తారతమ్యాలు, ఏకస్వామ్య పెట్టుబ డిదారీ వ్యవస్థ, నూతన వలస వాదాలు సామ్రాజ్యవాద ఫలితమేనని, దీనికి పరిష్కారం ప్రపంచవ్యాప్తంగా తిరుగుబాటు అని నమ్మి ప్రపంచ ప్రజలను ఆ దిశగా చైతన్య పరిచా డన్నారు. రాజకీయ విశ్లేషకులు ఎన్.సదాశివం మాట్లాడుతూ చేగువేరా క్యూబాను నియంత పాలన నుండి విముక్తి చేయడంలో గెరిల్లా పోరాటం చేసి విజయం సాధిం చాడని, క్యూబా తిరుగుబాటు తరువాత ప్రభుత్వంలో ప్రధాన బాధ్యతలను చేపట్టి అనేక వ్యవ సాయ సంస్కరణలను ప్రవేశపెట్టాడన్నారు. అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, లక్ష్మారెడ్డి, అనిల్‌కుమార్ ప్రసంగి ంచారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు పై హర్షం


తెనాలిలో హర్షం వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

ప్రజాశక్తి తెనాలి : ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు పై న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక గాంధీ చౌక్ లోని కె.వి.ఆర్ కాంప్లెక్స్ లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో న్యాయవాది వేములపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. ప్రజల ఆస్తులకు భద్రతలేని ఈ చట్టం రద్దుకు ఎన్నికల ప్రచారంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని, అధికారం చేపట్టిన వెంటనే ఆ హామీని నిలబెట్టుకోవడం పై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు కోరుతూ న్యాయవాదులు చేసిన ఆందోళనకు మద్దతు తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు గజ్జ శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాసరావు, తిరుమలశెట్టి రామకష్ణ, టి. కొండయ్య, డి.గోపీనాథ్, వై మత్యుంజ యరావు డి.సాంబశివరావు, వి. సూర్యనారాయణ, పి రామాంజనేయులు, పాల్గొన్నారు.


విత్తన నిల్వలు పరిశీలిస్తున్న అధికారులు

కొనసాగుతున్న విత్తన దుకాణాలలో తనిఖీలు

ప్రజాశక్తి-గుంటూరు

పురుగు మందుల పరీక్షా కేంద్రం ఎడిఎ సిహెచ్. తిరుమలాదేవి ఆధ్వర్యంలో విత్తన తనిఖీ బృందం తనిఖీలు కొనసాగుతున్నాయి. శనివారం స్థానిక పట్నంబజారులోని పలు విత్తన దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డుల ప్రకారం గోడౌన్‌లోని నిల్వలను లెక్కించారు. సోర్స్ సర్టిఫికెట్ చూపని కారణంగా విజయ శానిటరీ సీడ్స్ షాపులో సుఫల అగ్రిజెనిటిక్స్, నన్‌హెూమ్స్ కంపెనీలకు చెందిన రూ.1.99 లక్షల విలువైన 300 ప్యాకెట్ల మిరప విత్తనాల విక్రయాలు నిలుపుదల చేశారు. షోకాజు నోటీసులు కూడా జారీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. రైతుకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని డీలర్లకు సూచించారు. ఈ తనిఖీలలో గుంటూరు అర్బన్ వ్యవసాయాధికారి బి.కిషోర్ పాల్గొన్నారు.

రేపు నెలకుదిటి నాగేశ్వరరావు వర్ధంతి

ప్రజాశక్తి - తుళ్లూరు : తొలితరం కమ్యూనిస్టు నేత నెలకుదిటి నాగేశ్వరరావు వర్ధంతి కార్యక్రమం ఈ నెల 17 వ తేదీ సోమవారం ఆయన స్వగ్రామం రాజధాని అమరావతి పరిధిలోని దొండపాడులో నిర్వహించనున్నారు. సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ, నాగేశ్వరరావు అభిమానుల ఆధ్వర్యంలో సాయంత్రం 5 గంటలకు పంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న నాగేశ్వరరావు విగ్రహం వద్ద శ్రద్ధాంజలి ఘటించిన అనంతరం సభ జరుగుతుందని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి తెలిపారు. సభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతు,కూలీ,పేదల సమస్యల కోసం నికరంగా నిలబడి పని చేసిన నాగేశ్వరరావు వర్ధంతి సభలో సిపిఎం శ్రేణులతో పాటు, నాగేశ్వరరావు అభిమానులు పాల్గొనవలసిందిగా రవి విజ్ఞప్తి చేశారు.


భార్య జ్ఞాపకార్థం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న భర్త శ్రీరామమూర్తి, తదితరులు

జడ్‌పిహెచ్ స్కూల్ విద్యార్థులు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి చేబ్రోలు

మండలంలోని నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు నోటు పుస్తకాలను పాఠశాల విద్యార్థులకు అందజేశారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం ఏడుకొండలు వారిని అభినందించారు. 1984 -1985 ఎస్ఎస్‌సి బ్యాచ్‌లో చదివిన కొమ్మలపాటి శోభారాణి జ్ఞాపకార్థం ఆమె భర్త కొమ్మాలపాటి శ్రీరామమూర్తి విద్యార్థులకు నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు. ఒంగోలు లో ఈయన ఉపాధ్యాయులుగా పనిచేయుచున్నారు. తన భార్య చదివిన నారా కోడూరు పాఠశాల లో చదువుతున్న విద్యార్థులకు రూ. 40వేలు విలువ గల నోట్ బుక్స్ పుస్తకాలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారి రాయల సుబ్బారావు పూర్వ విద్యార్థుల సహకారం పాఠశాల అభివృద్ధికి ఆరోగ్యమైన మార్గమని అన్నారు. చదువు కున్న పాఠశాల రుణం తీర్చుకునే దానిలో భాగంగా విద్యార్థులకు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని అన్నారు. దాత కమ్మలపాటి శ్రీరామ్మూర్తిని సేవలను అభినం దించి ఎంఇఒ, పాఠశాల ఉపాధ్యాయుల బృందం ఆయనను సన్మా నించారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు బి వెంకటేశ్వరరావు, ఎ శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

షారోన్ స్కూల్ డైరెక్టర్ శ్యాం బెనర్జీ గుండెపోటుతో మృతి

ప్రజాశక్తి తెనాలి



స్థానిక బోస్ రోడ్డులోని షారోన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ కె శ్యామ్ బెనర్జీ(57) ఆకస్మికంగా మృతి చెందారు. శనివారం ఉదయం గుండెపోటు రావడంతో మృతి చెందారని, ఆయన అంత్యక్రియలు ఆదివారం నిర్వహించ నున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతదేహాన్ని చినరావూరు రైల్వే స్టేషన్ రోడ్డులోని స్వగహంలో ఉంచారు. ఆయన భార్య మేరీ బెనర్జీ పాఠశాల ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె ఏపీ సెక్రటేరియట్లో ఏ ఎస్ ఓ గా పనిచేస్తుండగా, రెండో కుమార్తె ఎంటెక్ పూర్తి చేసి పాఠశాల నిర్వహణలో ఉన్నారు. మూడో కుమార్తె డిగ్రీ చదువుతోంది. శ్యామ్ బెనర్జీ పలు ప్రైవేట్ పాఠశాలల్లో సైన్స్ ఉపాధ్యాయులుగా పనిచేసి 2000 సంవత్సరంలో షారోన్ టాలెంట్ స్కూల్‌ను దేవి గుడి రోడ్ లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ పాఠశాలను చినరావూరు పార్కు వద్దకు మార్చి, షారోన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌గా నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహించేవారు. ఏపీ ఆర్ జె సి, పాలిటెక్నిక్ వంటి పోటీ పరీక్షలకు శిక్షణ కూడా అందించేవారు. ఆయన మృతికి పలు ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

అనుమతి పొందిన ప్రాంతాల్లోనే మాంసపు విక్రయాలు

- వ్యర్థాలు నిర్దేశిత ప్రాంతంలో వేయాలి
- బక్రీద్ పండగపై సమీక్షలో కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రేపు జరగనున్న బక్రీద్ పండుగను ముస్లింలు సుహద్భావ వాతావరణంలో సంతోషంగా నిర్వహించుకోవాలని కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కర్ కోరారు. శనివారం నరసరావుపేటలోని కలెక్టరేట్ లో బక్రీద్ పండుగ నిర్వహణపై సంబంధిత ముస్లిం పెద్దలు వివిధ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాంస విక్రయాలను అనుమతి పొందిన నిర్దేశిత ప్రాంతాలలోనే విక్రయించాలని, వ్యర్థ పదార్థాలను, రక్తాన్ని డ్రైనేజీలలో కలపకుండా, చెత్తను ప్రత్యేకంగా పారవేయాలని పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జీవాలను అక్రమంగా తరలించరాదని, తరలించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రివెన్షన్ అండ్ ప్రొహిబిషన్ ఆఫ్ స్లాటరి యాక్ట్ -1977 మరియు ట్రాన్స్పోర్ట్ ఆఫ్ అనిమల్ రూల్స్-1978,2001 ప్రకారం నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతి పొందిన జీవాలను మాత్రమే మాంస విక్రయం చేయాలన్నారు. నోడల్ ఆఫీసర్ వద్ద అనుమతి తీసుకోవాలని, నోడల్ ఆఫీసర్ గా వెటర్నరీ డాక్టర్ నరసింహులు ను నియమించినట్లు చెప్పారు. 9491502474 లో వారిని సంప్రదించి అనుమతి పొందాలని సూచించారు.

రాష్ట్ర జిల్లా చెక్ పోస్ట్ ల వద్ద విస్తృత తనిఖీలు నిర్వహించాలని సంబంధిత అధికారు లను ఆదేశించారు. బక్రీద్ పండుగను ఘనంగా నిర్వ హించుకోవాలని, ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో అడిషనల్ ఆర్.రాఘవేంద్ర, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ కాంతారావు, మైనారిటీ వెల్ఫేర్ అధికారి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కర్

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

ప్రజాశక్తి-మాచర్ల

బక్రీద్ పండుగ నేపథ్యంలో నిబంధనల మేరకు జంతు వధ చేయాలని కమిషనర్ దేవళ్ళ వెంకటదాసు విక్రయదారులను హెచ్చరించారు. ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో, ఇళ్ళ వద్ద, రహదారుల ప్రక్కన, ప్రజలకు అసౌకర్యం కల్గించటం, అనుమతి లేని జంతువధశాలలో వధించటం చట్టరీత్యా నేరమని కమీషనర్ వివరించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనల మేరకు లైసెన్స్ పొందిన జంతువధశాలలో మాత్రమే జంతువులను వధించాలన్నారు. ఆవు దూడలను, 14 సంవత్సరాలలోపు ఎద్దు, దున్న, గేదెలను తదితర వధించకూడదని వివరించారు. ప్రభుత్వ పశు వైద్యశాల డాక్టర్లు ధృవీకరించిన వాటిని మాత్రమే వధించాలని తెలిపారు. నిబంధనలను ఉల్లఘించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎఇలు గౌతమి, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతిపై విధివిధానాలు ప్రకటించాలి : డివైఎఫ్ఐ

డిఎస్సీ ఆందోళనల్లో కేసులు ఎత్తివేయాలి

ప్రజాశక్తి - సత్తెనపల్లి

నిరుద్యోగ భృతిపై విధివిధానాలు వెంటనే రూపొందించి అమలు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయ రాజు తెలిపారు. శనివారం సత్తెనపల్లి పుతుంబాక వెంకటపతి భవన్‌లో డివైఎఫ్ఐ పల్నాడు జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆంజయేయ రాజు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానం అయినా మెగా డీఎస్సీ మీద సంతకం చేయటం సంతోషమని అలాగే మెగా డీఎస్సీ విడుదల చేయాలని ఆందోళనలు చేసిన సందర్భంగా పోలీసులు పెట్టిన కేసులు ఎత్తివేయాలని అన్నారు. స్కిల్ అసెస్‌మెంట్ పేరుతో కాలయాపన చేయకుండా నిరుద్యోగ భృతి హామీని అమలు చేయాలని, ఉపాధి పొందటం ప్రజల ప్రాథమిక హక్కుగా ప్రభుత్వాలు చేర్చాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా జరిగిన హింసలో బలి అయ్యింది యువతే అని, రాజకీయ పార్టీలు తమ స్వార్థం కోసం



యువతను ఎన్నికల్లో గొడవలు పడేలా ప్రోత్సహించారని అన్నారు. రాజకీయ పార్టీలు యువత భవిష్యత్తు ను దృష్టిలో పెట్టుకుని ఇటువంటి హింస జరగకుండా చూడాలని కోరారు. గ్రామ వాలంటీర్ వ్యవస్థను రాజకీయ పార్టీలు తమ పార్టీ కార్యకర్తల కేంద్రం గా కాకుండా నడపాలని మెరిట్ ఆధారంగా నియమించాలని , ఇంటర్వ్యూ ద్వారా నియమించే పద్ధతిని రద్దు చేయాలన్నారు. గత ప్రభుత్వం చేసిన 75శాతం స్థానిక పరిశ్రమల్లో రిజర్వేషన్ చట్టాన్ని కొనసాగించి కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు జడ రాజ్ కుమార్, ఉదయ్ భాస్కర్, ఇక్లాస్, హుస్సేన్ పాల్గొన్నారు.

'ఒత్తిళ్ళతో వలంటరీ ఉద్యోగాలకు రాజీనామా చేశాం.. దయ చూపండి'

ప్రజాశక్తి - రెంటచింతల

సార్వత్రిక ఎన్నికల ముందు అప్పటి అధికార పార్టీ నేతల ఒత్తిళ్ళతో వాలంటీర్ల ఉద్యోగాలకు రాజీనామా చేశామని, దీంతో బజారు పాలయ్యామని తమపై దయ చూపాలని మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డికి వలంటీర్లు విన్నవించారు. శనివారం బ్రహ్మారెడ్డి విజయోత్సవ ర్యాలీకి పార్టీ నేతలతో పాటు వలంటీర్లు కూడా వెళ్లారు. రెంటచింతల నుంచి 61, దుర్గి నుంచి 160, కారంపూడి 157 మంది రాజీనామా చేయగా వారంతా ఈ మేరకు బ్రహ్మారెడ్డికి వినతిపత్రం అందజేశారు. 'ఖాళీగా ఉంటున్నాం నోటి దగ్గర కూడుని కాళ్ళతో తన్నుకున్నాం' అని వాపోయారు. ప్రథమ తప్పుగా భావించి త మను ఆదుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.



మున్సిపల్ అధికారులు, టిడిపి నాయకులతో కలిసి టిడ్కో గృహ సముదాయాన్ని పరిశీలీస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

టిడ్కో గృహ సముదాయాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

మెరుగైన సదుపాయాలు కల్పించాలని ఆదేశం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

టిడిపి హయాంలో చేపట్టిన టిడ్కో గహ సముదాయం చివరి దశకు నిర్మాణం పనులు పూర్తి చేసుకున్న క్రమంలో టిడిపి అధికారం కోల్పోయిందని ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి కిట్కో గహాలు గురయ్యాయని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శనివారం ఎమ్మెల్యే నరసరావుపేట పట్టణ సమీపంలో చిలకలూరిపేట రోడ్డులో నిర్మించిన టిడ్కో గహ సముదాయాన్ని మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. పేదలకు పక్కా ఇల్లు కట్టించే బహత్తర కార్యక్రమానికి నాడు ఎన్టీఆర్ శ్రీకారం చుడితే, చంద్రబాబు నాయుడు గేటెడ్ కమ్యూనిటీ తరహా నిర్మాణాలతో మెరుగులు దిద్దారన్నారు. నియోజకవర్గంలో సొంత ఇల్లు లేని పేదలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు అందించి తీరుతానన్నారు. అదే సమయంలో టిడ్కో కాలనీలో మౌలిక సదుపాయాల కల్పన పై అధికారులు దష్టి పెట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో నాయకులు,అధికారులు పాల్గొన్నారు.



న్యాయవాదుల సమక్షంలో కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే

భూ యాజమాన్య హక్కు చట్టం రద్దుపై న్యాయవాదుల హర్షం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్రంలో భూ యాజమాన్య హక్కు చట్టం (ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్) రద్దు పై నరసరావుపేట బార్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు శనివారం కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు కేకు కట్ చేసి న్యాయవాదులకు అభినందనలు తెలిపారు. వైసిపి ప్రభుత్వం అక్రమంగా ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దుచేస్తూ ఎన్డీఏ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల రాష్ట్ర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు మేదరమెట్ల నాగేశ్వరరావును అరవింద బాబు సత్కరించారు. మేదరమెట్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం చట్టాన్ని రద్దు చేస్తూ రెండవ సంతకం చేసిన ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు కు పవన్ కళ్యాణ్ కు న్యాయవాదుల సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోని యేషన్ కార్యదర్శి అబ్బూరి ఏడుకొండలు, న్యాయవాదులు చేకూరి ప్రతాప్ కుమార్, బి అనిల్ కుమార్, జి అలెగ్జాండర్ సుధాకర్ , కె ఎస్ ఆర్ ఏ ఆంజనేయులు, ఎం. ఆరోగ్యం చౌదరి, చెన్నుపాటి నాగేశ్వరరావు, ముత్త వరపు వెంకటేశ్వర్లు చౌదరి,మేళం శ్రీకష్ణ, బి.పిచ్చే శ్వరరావు,కె. విజయ్ కుమార్, లక్ష్మి కుమారి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యతోనే మెరుగైన సమాజం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్యా వ్యవస్థను పటిష్టం చేసినపుడే రాష్ట్రం, దేశం బాగుపడుతుందని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు.ఈ మేరకు నరసరావుపేట పట్టణ సమీపంలోని లింగంగుంట్ల లో శంకర భారతిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ చేపట్టారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థలలో సమూల మార్పులు తీసుకొచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు చెందిన రూపాయి కూడా వృథా కాకూడదన్న లక్ష్యంతో విద్యా కిట్లపై జగన్ పేరు ఉన్నా గానీ వాటినే పంచడానికి సిద్ధమవడం చంద్రబాబు పాలనకు, దార్శనికతకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్ ను సిద్ధం చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి -సత్తెనపల్లి రూరల్

అన్న క్యాంటీన్ ప్రారంభానికి మున్సిపల్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పేదవారి ఆకలి తీర్చేందుకు 2014 లో అప్పటి టిడిపి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్ల ప్రారంభించింది. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్న క్యాంటీన్ల ను మూసివేసింది. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ ఫైల్ పై సంతకం చేశారు. ఈ నేపథ్యంలో సత్తెనపల్లి పట్టణంలో ముడిపడిన అన్న క్యాంటీన్ భవనాన్ని మున్సిపల్ అధికారులు శుభ్రం చేస్తున్నారు. ప్రారంభానికి భవనాన్ని మున్సిపల్ అధికారులు సిద్ధం చేస్తున్నారు.



దళిత బహుజన రీసోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సెంటర్ నిర్వాహకులు, రైతులు

సుస్థిర సాగుపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో నరసరావుపేట మండలం లోని పెద్దరెడ్డిపాలెం గ్రామ ఎస్టి కమ్యూనిటీ హాల్ నందు సుస్థిర వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం సాంబయ్య అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి మల్లెల చిన్నప్ప, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ పవన్ పాల్గొన్నారు. ఎస్సీ ఎస్టీ రైతులకు సుస్థిర వ్యవసాయంపై అవగాహన, పచ్చిరొట్ట పైరు సాగు చేయడం వలన కలిగే ప్రయోజనాలు రైతులకు వివరించారు.



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు చేసి ప్రజల ఆస్తులకు భద్రత కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి వర్తక, వాణిజ్య విభాగం నాయకులు శనివారం పాలాభిషేకం చేశారు. సత్తెనపల్లి తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం సభ్యులు రాష్ట్ర పార్టీ కార్యదర్శి చౌట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక గాంధీ చౌక్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్వీట్స్ పంపిణీ చేసి హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వర్తక వాణిజ్య విభాగం నాయకులు జె. రామమోహన్‌రావు, పి.కోటేశ్వరరావు, డి.శ్రీనివాసరావు,డి.శివ ప్రసాదరావు, డి. జానకి రామారావు, టి.వెంకటేశ్వర్లు, వి. శివ నాగేశ్వరరావు, ఎన్. రమణ, ఎ.బాలసుబ్రహ్మణ్యం, బి.కొం డలు, పి.నరసింహారావు, ఎం.వెంకటేశ్వర్లు, డి.కాశీ పాల్గొన్నారు.

మహాకవి శ్రీశ్రీకి ఘన నివాళి

ప్రజాశక్తి మంగళగిరి

మహాకవి శ్రీ శ్రీ 41 వ వర్ధంతిని శనివారం పాత మంగళగిరి పొట్లాబత్తుని వెంకటేశ్వరరావు కళా నిలయంలో మంగళగిరి సాహితీ కళా వేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించింది. ప్రపంచంలో తెలుగు భాష ఎంతో మాధుర్యమైనదని, జాతీయ భాషగా తెలుగును గుర్తించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాన్ని మహాకవి శ్రీశ్రీ అనేక చోట్ల తన మనసులో మాట చెప్పారని సాహితీ కళావేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయరావు అన్నారు. ప్రగతిశీల కవి గోలి మధు మాట్లాడుతూ నేటి దోపిడీ సమాజాన్ని నిలదీసే ఆయుధం అన్నారు.పుర ప్రముఖులు నన్నపనేని నాగేశ్వర రావు ప్రసంగిస్తూ శ్రీశ్రీ తో తనకు గల అనుబంధాన్ని వివరించారు. విశ్వశాంతి కళా పరిషత్ వ్యవస్థాపకులు పొట్లాబత్తుని లక్ష్మణ రావు గారు శ్రీశ్రీ సినిమా పాటలను ఉటంకిస్తూ ప్రసంగించారు. బుద్ధభూమి వర్కింగ్ ఎడిటర్ గోలి సీతారామయ్య శ్రీశ్రీ సాహిత్య అంశాలను, ప్రత్యేకతలను వివరించారు. కార్యక్రమంలో రేఖా కృష్ణార్జునరావు, రేఖ చంద్రశేఖర్, ఎస్ భూపతి, గోలి సీతారామయ్య, ఏ తాతారావు, మంచా విజయమోహన్ రావు, చాపరాల ఇందిరా, సాంబిరెడ్డి (విజయప్రెస్) కారంపూడి అంకమ్మ రావు, మహమ్మద్ యూసఫ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు

మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ)41వ వర్ధంతి సందర్భంగా శనివారం పెదనందిపాడు లోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నివాళులు అర్పించారు. విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల కమిటీ కన్వీనర్ జంపని రామారావు శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ శ్రీశ్రీ పీడిత ప్రజా సమస్యలపై తన గళాన్ని వినిపించారని, వారు రచించిన మహాప్రస్థానం, ఖడ్గసృష్టి వంటి కవితా సంకలనాలతో ప్రజలలో చైతన్యం తీసుకు వచ్చారని తెలిపారు. పాత ఛాందస భావాలను విడనాడి, శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలని వారి రచనల ద్వారా తెలియపరిచారన్నారు. ప్రజా సమస్యలపై వినిపించిన వారి తెగువను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల కమిటీకో కన్వీనర్ కొత్త వెంకటశివరావు, సభ్యులు చుక్కా యానాదులు, మర్రి లక్ష్మి, ఇంటూరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి తెనాలి :సామాజిక చైతన్యానికి స్ఫూర్తి ప్రదాత శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) అని శ్రీ శ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షులు డాక్టర్ రంగశెట్టి రమేష్ అన్నారు. శ్రీ శ్రీ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక నాజరుపేటలోని శ్రీశ్రీ కళావేదిక కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి రమేష్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ సామాజిక చైతన్యాన్ని రేకెత్తించే కావ్యాల్ని రచించి, నవ యువతకు శ్రీ శ్రీ స్ఫూర్తిదాయకమయ్యారన్నారు. వాడుక భాషలో రచనలు చేసి, సామాన్యుని ఇంటి ముంగిట సాహితీ రంగవల్లులు దిద్దిన మహాకవి అని, ఆయన రచించిన మహా ప్రస్థానం శ్రామిక, కర్షక ,బడుగు బలహీనర్గాలకు దిక్సూచిగా నిలిచిందన్నారు. ఈ యుగం నాదని సగర్వంగా చాటుకున్న అభ్యుదయ కవి అని కొనియాడారు. తొలుత శ్రీ శ్రీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ,కవి ఆళ్ళ నాగేశ్వరరావు, ఎపి ప్రజా నాట్యమండలి ప్రధాన కార్యదర్శి బొల్లిముంత కష్ణ, ఇ ప్రేమ్ కుమార్, డాక్టర్ పెద్దిటి యోహాను, ఎస్ బదరీనాథ్, యం.వి. రఘునాధ రావు, వి భీమేశ్వర ప్రసాద్ పాల్గొన్నారు.



పెదనందిపాడులో శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


మంగళగిరిలో శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు


తెనాలిలో శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళావేదిక బృందం


సిబ్బందితో కలిసి హెల్మెట్లతో ర్యాలీకి సిద్ధమవుతున్న డిఎస్పి రమేష్

పోలీసులకు ఉచిత హెల్మెట్లు పంపిణీ

ప్రజాశక్తి-తెనాలిరూరల్ :తెనాలి టూ టౌన్ సిఐ ఎ సుధాకర్ ఆధ్వర్యంలో శనివారం బైక్ ర్యాలీ విత్ హెల్మెట్ కార్యక్రమాన్ని నిర్వహి ంచారు. ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలన్న సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సుధాకర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో తెనాలి డిఎస్పి ఎం రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. హెల్మెట్ ధరించని సామాన్య ప్రజలకు చలాన విధించాలంటే ముందుగా పోలీసులు హెల్మెట్లు ధరించాలని అన్నారు. దాతలు నుంచి సేకరించిన 40 హెల్మెట్లను సిబ్బందికి ఉచితంగా అందజేశామన్నారు. తెనాలి పట్టణంలో బజాజ్, టివిఎస్, సుజుకి, రాయల్ ఎన్ఫీల్డ్, యమహా, హీరోహోండా షోరూంల యజమానులు హెల్మెట్లు వితరణ చేశారన్నారు. అనంతరం డిఎస్పి రమేష్‌తో కలసి సిఐ లు సుధాకర్, వెంకటేశ్వర్లు, ఎస్సైలు కరీముల్లా, కోటేశ్వరరావు, సిబ్బంది హెల్మెట్లు ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు.


ఈ కేవైసీ చేస్తున్నా హెచ్పీ గ్యాస్ సిబ్బంది

ప్రభుత్వ పథకాలకు ఈకేవైసీ తప్పనిసరి

ప్రజాశక్తి దుగ్గిరాల : అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలు పొందటానికి ఈ కేవైసీ మరియు సేఫ్టీ చెకప్ తప్పనిసరిగా చేయిం చుకోవాలని స్థానిక హెచ్పి గ్యాస్ ఏజెన్సీస్ అధినేత గద్దె శ్రీని వాస్ శనివారం తెలిపారు. గ్యాస్ ఏజెన్సీస్ మెకానిక్‌లు మరి యు డెలివరీ బాయ్స్ ప్రతి గ్రామంలో క్యాంపులు నిర్వ హిస్తున్నట్లు ఆయన తెలిపారు. గతంలో ఈకేవైసి చేయిం చినప్పటికీ ఇంకా అనేకమంది చేయించవలసి ఉన్నదని అందువలన ప్రతి గ్రామంలో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక్కసారి చేయించిన వారు మరల చేయించే అవసరం లేదని, ఇది పూర్తిగా ఉచితంగా చేస్తున్నామని, ఎటువంటి రుసుము చెల్లించ నవసరం లేదన్నారు.


ప్రత్యేక అవసరాలున్న విద్యార్థికి కిట్ అందజేస్తున్న అధికారులు

భవిత కేంద్రాలు పున: ప్రారంభం

ప్రజాశక్తి- చేబ్రోలు : ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలు వేసవి సెలవుల తర్వాత ప్రారంభమయ్యాయి. ఎంపీపీ పాఠశాల కొత్తపేటలోని భవిత కేంద్రంలో వేసవి కాలం సెలవుల తరు వాత శనివారం నుండి పున్న ప్రారంభించామని పాఠ శాల ప్రత్యేక ఉపాధ్యాయురాలు జి అనురాధ, జి రాజేష్ దినకరన్ తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు మాట్ాడారు. విద్యార్థుల తల్లితండ్రుల సమావేశాన్ని నిర్వహిం చామన్నారు. 2024-2025 విద్య సంవత్స రంలో భవిత కేంద్రం ద్వారా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అందించే సేవల కార్యాచరణ గురించి తల్లి దండ్రులకు వివరించామని తెలిపారు. వేసవి సెలవుల తర్వాత కేంద్రం ప్రారంభించిన రోజునే విద్యార్థులకు ఫిజియోథెరపీ సేవలను అంద జేశామని, ప్రతి బుధవారం భవిత సెంటర్‌లో ఫిజియోథెరపీ క్యాంప్స్ జరుగుతాయని తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల తల్లి దండ్రులు ఈ సేవలను వినియోగించుకోవాలని ఎంఇఒ ఏవి హెచ్ ప్రసాద్, ఆర్ సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా వికలాంగ బాల, బాలికలకు అధికారులు స్టూడెంట్స్ కిట్స్, ఫ్రూట్స్ అందజేశారు.

నేడు మెదడు నరాల సంబంధిత వ్యాధులపై ఆరోగ్య సభ

ప్రజాశక్తి-గుంటూరు

అవగాహన సంస్థ గత 15 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఆరోగ్య సభలలో భాగంగా నేడు అరండపేట 15/1, కుబేరా టవర్స్‌లోని అవగాహన కార్యాలయంలో మెదడు, నరాల సంబంధిత వ్యాధులపై ఆరోగ్య సభ నిర్వహిస్తున్నట్లు అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆరోగ్య సభలో న్యూరాలజిస్ట్ డాక్టర్ కె.నీరజ ప్రధాన వక్తగా పాల్గొంటారని, స్ట్రోక్, మైగ్రేన్ తల నొప్పి, మూర్ఛ, నిద్ర రుగ్మతలు, వెర్టిగో, చిత్త వైఫల్యం, పార్కి న్సన్స్ వ్యాధి, మూమెంట్ డిజార్డర్ తదితర సమస్యల గురించి ఆమె వివరిస్తారన్నారు. సందేహాలను నివత్తి చేస్తారని తెలిపారు.అలాగే ప్రముఖ డైటీషియన్ బిక్షపతి 60 ఏళ్ల తర్వాత మంచి ఆరోగ్యం కోసం ఏం తినాలి, ఏం తినకూడదు అనే అంశంపై మాట్లాడతారిన, కావున ఆరోగ్యాభిలాషులు అందరూ ఈ సభలో పాల్గొనాలని కోరారు.

ఎన్‌జి రంగా సాహిత్య పురస్కారానికి రచనలకు ఆహ్వానం

ప్రజాశక్తి-గుంటూరు

ఆచార్య ఎన్‌జి రంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2024 సంవత్సరానికి ఎన్‌జి రంగా సాహిత్య పురస్కారాలకు ఈ ఏడాది రచయిత్రులకు మాత్రమే అవకాశం కల్పిస్తున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ జక్కంపూడి సీతారామారావు తెలిపారు. 2021-23 సంత్సరాల్లో తెలుగు రచయిత్రులు రాసిన నవలలు మాత్రమే పరిశీలనకు పంపించాలని, ఎంపికైన నవలలో మొదటి బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు నగదు పురస్కారం ఉంటుందన్నారు. పోటీకి తమ రచనలు పంపే వారు నాలుగు ప్రతుల చొప్పన డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, 202-శ్రీవెంకటసాయి రెసిడెన్సీ, 2వ లైను రామయ్య నగర్, ఒంగోలు 523002 (ఫోన్ నంబర్ 9849799711) అడ్రస్‌కు పంపించాలన్నారు. నవంబర్ 7న గుంటూరులో జరిగే ఆచార్య ఎన్‌జి రంగా జయంతి వేడుకల సందర్భంగా విజేతలకు బహుమతి ప్రదానం చేయటం జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు డాక్టర్ జక్కంపూడి సీతారామారావు (98494 97739), డాక్టర్ వెన్నిశెట్టి సింగారావు (93930 15584), డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు (98483 51517) నంబర్లలో సంప్రదించాలని కోరారు.


మీడియాతో మాట్లాడుతున్న వేమారెడ్డి,మురుగుడు హనుమంతరావు

కక్ష పూరిత రాజకీయాలు తగవు

ప్రజాశక్తి-తాడేపల్లి :మంగళగిరి నియోజకవర్గంలో కక్షపూరిత రాజకీయాలు తగవని, ప్రస్తుతం జరుగుతున్న విధ్వంస రాజకీయాలు గతంలో ఎన్నడూ లేవని ఎంటిఎంసి వైసిపి అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. శనివారం ఎంటిఎంసి వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏ పార్టీలో ఉన్నా నాయకులం మేమంతా బాగానే ఉంటామని, నష్టపోయేది కార్యకర్తలేనని చెప్పారు. దౌర్జన్యాలకు దిగే వారు, విగ్రహాలు పగలకొట్టే ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు. పోలీస్‌స్టేషన్లకు వెళ్లి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఇప్పటికైనా హింసాకాండ ఆపాలని కోరారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, గెలిచిన పార్టీ ఓడిన పార్టీతో కక్ష పెంచుకోవడం సరికాదని అన్నారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు మేకా అంజిరెడ్డి, యు.కల్యాన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


యోగా నిర్వహిస్తున్న ఆరోగ్యశాఖ సిబ్బంది, పేషెంట్లు

హెల్త్ సెంటర్లలో యోగ

ప్రజాశక్తి దుగ్గిరాల

కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలోని ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా ప్రతి హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లలో ప్రతిరోజు యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిహెచ్ఓ బుజ్జి తెలిపారు. స్థానిక దళిత వాడలోని పీహెచ్సీ సబ్ సెంటర్లో శనివారం యోగా కార్యక్రమాన్ని ఆమె ఆధ్వర్యంలో నిర్వహించారు. మధుమేహం రక్తపోటు ఉన్నవారికి తప్పనిసరిగా ఈ కార్యక్రమంలో భాగస్వాములు చేస్తున్నట్లు తెలిపారు. వారితో పాటు తమ సిబ్బంది కూడా యోగా చేస్తున్నట్లు తెలిపారు.

అనధికార జంతు వధ నిషేధం : కమిషనర్

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ, ఈనెల 17వ తేదీన బక్రీదు పండగ సందర్భముగా పట్టణములోని ఆవులు, లేగ దూడలు, పాలిచ్చే గేదెలు మరియు ఇతర నిషిద్ధ పశువులను వధించరాదని కబేల యజమానుదారులకు మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ వి నిర్మల కుమార్ శనివారం తెలిపారు. అందుకు భిన్నముగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు జంతు హింస నివారణ చట్టాల ఉల్లంఘన జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. దీనికి సంబంధించి హైకోర్టు నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఇప్పటికే సచివాలయ సిబ్బందిని బృందాలుగా ఏర్పాటు చేసి నిఘా పెట్టామని పేర్కొన్నారు.

గుంటూరు ఛానల్ పొడిగింపు సమస్యపై కార్యాచరణకు రేపు నల్లమడ రైతు సంఘం ఆధ్వర్యంలో సమావేశం

ప్రజాశక్తి-పెదనందిపాడు

గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగింపునకు నిధులు కేటాయించాలని కోరుతూ నల్లమడ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల సమావేశం పెదనందిపాడు గ్రామం లోని కొల్లా వెంకయ్య లైబ్రరీలో 17వ తారీకు సోమవారం సాయంత్రం 5గంటలకు జరుగుతుందని నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు కొల్లా రాజమోహన్‌రావు శనివారం తెలి పారు. సుదీర్ఘకాలం నుంచి కొనసాగుతున్న ఈ సమస్యపై కార్యాచరణ రూపొందించుకోవడానికి ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కావున రైతులు, ప్రజలు అందరూ పాల్గొని తమ అభిప్రాయాలు తెలియపరచవలసిందిగా వారు కోరారు.

కాపులకు అన్యాయం చేసిన జగన్‌కు గుణపాఠం

ప్రజాశక్తి-మంగళగిరి

కాపులకు తీవ్ర అన్యాయం చేసిన జగన్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పారని రాష్ట్ర తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి ఆకుల జత్యసత్య అన్నారు. శనివారం టీడీపీ కార్యాలయం నియోజకవర్గ కార్యాలయంలో కాపుదళం కన్వీనర్ రంగిశెట్టి నరేంద్ర (బాబి), ఆధ్వర్యంలో మీడియాతో ఆమె మాట్లాడారు. పవన్, చంద్రబాబుపై ఉన్న నమ్మకంతో కాపు సామాజికవర్గంలో అత్యధిక శాతం ఓట్లు కూటమికి వేయడంతో కూటమి సునామీ సృష్టించిందన్నారు. దేశంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా మంగళగిరిని నారా లోకేష్ అభివృద్ధి చేస్తారన్నారు. ఐదేళ్ల అరాచక పాలనకు రాష్ట్ర ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. కార్యక్రమంలో మంగళగిరి పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, నియోజకవర్గ కాపుదళం కో కన్వీనర్ బుర్ర కృష్ణ వందన, తాడేపల్లి పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు అన్నే కుసుమ, కాపుదళం నాయకులు విన్నకోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

20న హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ కోర్సులో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెంకటగిరిలోని ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ హ్యాండ్‌లూమ్స్ టెక్నాలజీ సంస్థలో హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ టెక్నాలజీలో 3 సంవత్సరాల డిప్లొమా కోర్సులో ప్రవేశానికి ఈనెల 20వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు చేనేత జౌళిశాఖ జిల్లా సహాయ సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో శిక్షణతోపాటు, కేంద్ర ప్రభుత్వ జౌళి శాఖ సర్టిఫికెట్ జారీ చేస్తుందన్నారు. దక్షిణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్నాటక, మహారాష్ట్ర, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులకు ఇక్కడ ప్రవేశాలు కల్పిస్తారని, దేశంలో ఉన్న 10 హ్యాండ్‌లూమ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో వెంకటగిరి ఇనిస్టిట్యూట్ ఒకటని తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులు అయిన అభ్యర్థుల మార్కుల మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారని, ఈ కోర్సు పూర్తి చేసిన వారికి పలు చేనేత, జౌళి శాఖకు సంబంధించిన ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. ఈ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగటానికి అవకాశాలు మెండుగా ఉంటాయని, ఉన్నత చదువులు చదవాలనుకున్న వారికి ఈ కోర్సు చేసిన తర్వాత నేరుగా రెండో సంవత్సరం బి.టెక్‌లో ప్రవేశించవచ్చన్నారు. ఈ కోర్సు చదివేవారందరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు స్టైఫండ్ పొందటానికి అర్హులని, ఇతర వివరాలకు కాలేజి వెబ్‌సైట్ www.lihtvgr.com ను సందర్శించాలని, లేదా 9441795408, 9866169908, 9010243054 నంబర్లను సంప్రదించాలన్నారు.

విద్య, ఉపాధి కల్పన టిజెపిఎస్ లక్ష్యం

ప్రజాశక్తి-గుంటూరు


మాట్లాడుతున్న కళాశాల సెక్రెటరీ కెవి బ్రహ్మం

సామాజిక, సేవా ధృక్పదంతో 1971లో మొదలై ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన టిజెపిఎస్ కాలేజి విద్యతోపాటు ఉపాధి కల్పన లక్ష్యంగా పని చేస్తున్నట్లు కళాశాల సెక్రటరీ, కరెస్పాండంట్ కె.వి. బ్రహ్మం అన్నారు. శనివారం కళాశాలలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని చెప్పారు. విద్యతో పాటు ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి, స్పోర్ట్స్ వంటివి ఉన్నాయని, ప్రతి ఏటా రెండుసార్లు జాబ్‌మేళా నిర్వహించి విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చే విధంగా కృషి చేస్తున్నామన్నారు. అలాగే కెమిస్ట్రీ, ఫిజిక్స్, బోటనీ, జువాలాజి, కంప్యూటర్ కోర్సులకు అధునాతనమైన ల్యాబ్‌లు, సి.సి. కెమెరాల పర్యవేక్షణలో తరగతి గదుల నిర్వహణ, మహిళలకు ఆత్మరక్షణ కోసం టైక్వాండో వంటి వాటిలో శిక్షణ, విద్యార్థుల అభివద్ధికి జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, వర్క్‌షాప్‌లు, క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇంటర్, డిగ్రీ, పి.జి. కోర్సులు ఉన్నాయని చెప్పారు. సమావేశంలో కళాశాల అధ్యక్షులు పోలిశెట్టి శ్యాంసుందర్, వాసవి విద్యానిది కమిటీ సెక్రటరీ పి.నాగసుందరం, వాసవి విద్యానిది అధ్యక్షులు పి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలు చేస్తేనే ఉజ్వల భవిత

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ శాస్త్రి

గణిత రంగంలో పరిశోధనలు చేసిన విద్యార్థు లకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ సి.శాస్త్రి అన్నారు. చేబ్రోలు మండ లం, వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని 'ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ మేథ మ్యాటిక్స్ అండ్ సైంటిఫిక్ కంప్యూటింగ్' అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ కాన్ఫరెన్స్ శనివారం ముగిసింది.ఈ సదస్సులో ప్రొఫెసర్ శాస్త్రి మాట్లాడుతూ విభిన్న వర్గాల వినియోగదారులు, వారి అభిరుచులు, వారి అవసరాలను గుర్తించే క్రమంలో సమాచారాన్ని సేకరించడం, వాటిని క్రోడీకరించి వర్గీకరిస్తేనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. మేథమేటిక్స్, స్టాటిస్టిక్స్ రంగాలలో పరిశోధనలు పెరిగితే మానవాళికి ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని, దీనిపై యువత దష్టి సారించాలన్నారు. కార్యక్రమానికి ఆన్‌లైన్‌లో హాజరైన హైదరాబాద్‌లోని నోవార్టిస్ కంపెనీ డేటా అనలిస్ట్ డాక్టర్ ఎం.వేణుగోపాలరావ్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు వారి బ్రాంచిలకు సంబంధించిన సబ్జెక్టులపైనే కాకుండా ప్రాథమిక సైన్స్, మేథమేటిక్స్ విషయాలపై అవగాహనతో ఉంటే ఎంతో మంచిదని తెలిపారు. భవిష్యత్తులో ఈవిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతుందని సూచించారు. మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్, ప్రాబబిలిటీ వంటి స్పెషలైజేషన్లు చదివి స్టాటిస్టికల్ అనాలిసిస్ సిస్టమ్, హడూప్ వంటి తదితర సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్‌లలో శిక్షణ పొందితే డేటా సైంటిస్ట్ నైపుణ్యాలు సొంతం చేసుకోవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమరావతిలో పొంచి ఉన్న సవాళ్లు



రాష్ట్ర రాజధాని అమరావతికి మళ్లీ మంచి రోజుల వచ్చాయి. రాష్ట్రంలో వైసిపి ఘోరంగా ఓడిపోయి టిడిపి అధికారంలోకి రావడంతో రాజధాని గ్రామాల్లో మళ్లీ ఐదేళ్ల క్రితం ఉన్న 'కళ' ఉట్టిపడుతోంది. అమరావతిలో గత ప్రభుత్వ హయంలో చేపట్టిన నిర్మాణాలు దాదాపు 80 నుంచి 90 శాతం పూర్తయ్యాయి. మిగతా పనులను పూర్తి చేసి రాజధానిలో అధికారులు, ప్రజా ప్రతినిధులకు అప్పగించాల్సిన గత ప్రభుత్వం మొండిగా వ్యవహరించింది. 2019 మే నాటికి పురోగతిలో ఉన్న పనులన్నీ ఎక్కడికక్కడ నిలిపివేశారు. కాంట్రాక్టర్లు అంతా వెనుదిరిగారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత అమరావతి అభివృద్ధి మొత్తం ఆగిపోయింది. 2019 డిసెంబరు 17న అసెంబ్లీలో సిఎం జగన్ మూడు రాజధానుల బిల్లు ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రైతులు సుదీర్ఘకాలం ఉద్యమం నిర్వహించారు. ఈ ఉద్యమంలో అనేక మంది మహిళలు హింసకు గురయ్యారు. రెండుసార్లు పాదయాత్రలు చేశారు. ఉద్యమాన్ని ఢిల్లీ వీధుల వరకు తీసుకువెళ్లారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు అమరావతినే ఏకైక రాజధానిగా కొనసాగించాలని స్పష్టం చేశాయి. వైసిపి మాత్రం మూడు రాజధానుల నినాదం కొనసాగిస్తోంది. రైతుల ఉద్యమాన్ని భేఖాతరు చేస్తూ ఇటీవల జరిగిన ఎన్నికలకు ముందు వైసిపి తన మేనిఫెస్టోలో మూడు రాజధానుల అంశానికి ప్రాధాన్యత ఇచ్చారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు మూడు రాజధానులకు వ్యతిరేకంగా తీర్పును ఇచ్చారు. టిడిపి ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. రాజధాని గ్రామాల్లో మళ్లీ కదలిక వచ్చింది. అభివృద్ధి పనులను పునరుద్దరించారు.మళ్లీ అభివృద్ధి వెలుగులు గ్రామాల్లో కన్పిస్తున్నాయి. దీంతో రైతులు ఉద్యమాన్ని విరమించారు. ప్రభుత్వం మారడంతో రాజధాని గ్రామాల్లో మళ్లీ సందడి నెలకొంది. అయితే టిడిపి ప్రభుత్వానికి కూడా అమరావతి అభివృద్ధిపై అనేక సవాళ్లు పొంచి ఉన్నాయి. ప్రధానంగా రాజధాని గ్రామాల్లో భూ సమీకరణలో భూములు ఇచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు అప్పగింత పెద్ద ప్రహసనంగా మారింది. 2017-18లో రైతులకు కాగితాలపై ప్లాట్లు అప్పగించారు. మొత్తం 54 వేల ప్లాట్లు ఏర్పాటు అయ్యాయి. దాదాపు 26 రెవెన్యూ గ్రామాల్లో ఈ ప్లాట్ల అప్పగింత ప్రక్రియ పూర్తి చేయాల్సిఉంది. అభివృద్ధి చేసిన ప్లాట్లను రైతులకు ఇవ్వాల్సి ఉంది. 2017-18లో ఇందుకు ఎకరాకు రూ. కోటి వరకు ఖర్చు అవుతాయని అంచనావేశారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ప్లాట్ల అప్పగింత కోసం అభివృద్ధి పనులకు ఎకరాకు రూ.2 కోట్లవరకు ఖర్చుఅవుతాయని అంత నిధులు తమ వద్ద లేవని హైకోర్టులో అఫిడవిట్‌దాఖలు చేసింది. ఈనేపథ్యంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన టిడిపి ప్రభుత్వం తక్షణం రైతులకు ప్లాట్ల అప్పగింతపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం కేంద్రనుంచి ప్రత్యేకంగా నిధులు తెచ్చుకోవాల్సిన అవసరంఉందని నిపుణులు చెబుతున్నారు. రాజధాని నిర్మాణం కోసం 2017లో టిడిపి ప్రభుత్వం రూ.48 వేల కోట్లతో రాజధాని నిర్మాణాలకు టెండర్లు పిలిచింది. ఇందులో రూ.9 వేల కోట్లతో పనులు ప్రారంభించారు.

ఆరువేల కోట్ల వరకు పనులు పూర్తయ్యాయి. మిగతా పనులన్నీ పెండింగ్‌లో ఉన్నాయి. రాజధాని నిర్మాణం కోసం దాదాపు రూ.50 వేల కోట్ల, రైతుల ప్లాట్లు అభివృద్ధికి మరో రూ.50 వేల కోట్ల తక్షణం లక్ష కోట్లు అవసరం అని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇంత భారీగా నిధుల సమీకరణ టిడిపి ప్రభుత్వానికి కత్తిమీద సాములాంటిదే. అలాగే 29 గ్రామాల పరిధిలో 22,948 మంది రైతులకు 28,128 ఎకరాల భూమికి రూ.183.17 కోట్లు కౌలు పరిహారం గత ఏడాది చెల్లించలేదు. ఈఏడాది కూడా ఇంత వరకు చెల్లింపులు జరగలేదు. మొత్తం రూ. 366.34 కోట్లు తక్షణం రైతులకు చెల్లించాల్సి ఉంది.2016 నుంచి కౌలు చెల్లింపులు ప్రారంభించింది. 2026 వరకు ఈ చెల్లింపులు కొనసాగుతాయి. 29 గ్రామాల్లో 3వేల మంది అసైన్డు రైతులు ఉన్నారు. వీరి భూములు కూడా రాజధానికి తీసుకున్నారు. అయితే అసైన్డు భూముల అప్పగింతలో అక్రమాలు జరిగాయని సిఐడి అధికారులు కేసులు నమోదు చేయడంతో కౌలు పరిహారంను పెండింగ్‌లో పెట్టారు.దీంతో 3 వేలమంది అసైన్డు రైతులకు కౌలు పరిహారం నిలిపివేశారు. మొత్తంగా భూములు ఇచ్చిన రైతులతో పాటు అసైన్డు రైతులకు కూడా త్వరలో కౌలు సొమ్ము జమఅవుతుందని రైతులు ఆశాభావంతో ఉన్నారు.

(ఎ.వి.డి.శర్మ)

'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు 'నేను బడికి పోతా' కార్యక్రమం అమలుపై జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ అధ్యక్షతన శనివారం వివిధ శాఖల జిల్లా స్తాయి అధికారులతో సమన్వయ సమావేశం డిఇఒ కార్యాలయంలో నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించాలని సమగ్ర శిక్ష ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. జులై 12వ తేదీ వరకూ ఈ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. 6-14 ఏళ్లలోపు ఉన్న పిల్లలందరూ బడిలో ఉండేలా చూడాలని, వందశాతం ప్రవేశాలు ఉండాలని సూచించారు. బడి మానేసిన పిల్లల్ని సిఆర్‌పిలు, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్‌ల ద్వారా పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఇందుకు జిల్లా, మండల, గ్రామస్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలని, ఇంటింటికీ ప్రచారం చేయాలని కోరారు. అలాగే ఈనెల 18వ తేదీ వరకూ బడి ఉత్సవం, బాలికా ఉత్సవం, విద్యా సదస్సు వంటివి నిర్వహించాల్సి ఉందన్నారు. సమావేశంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ, పంచాయతీ శాఖ, ఉప విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ

ఘనంగా బ్రహ్మారెడ్డి విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి-మాచర్ల

మాచర్ల నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన జూలకంటి బ్రహ్మానందరెడ్డి శని వారం మాచర్లలో నిర్వహిం చిన విజయోత్సవ ర్యాలీకి విశేష స్పందన లభించింది. బ్రహ్మారెడ్డి గెలిచిన తరువాత తొలిసారి నియోజకవర్గానికి వచ్చిన సందర్భ ంగా పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఉదయం కారంపూడి మండలం నుంచి ప్రారంభమైన విజయోత్సవ ర్యాలీ దుర్గి మండలం మీదుగా రాత్రి 7 గంటలకు మాచర్ల పట్టణానికి చేరుకుంది. రాయవరం వద్ద పార్టీ నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికి పట్టణంలోకి భారీ ర్యాలీగా ప్రవేశించారు. టిడిపి పట్టణ అధ్యక్షులు కొమెరా దుర్గారావు, యెనుముల కేశవరెడ్డి, బ్రహ్మారెడ్డిలు, వాహనంపై నుంచి ఉరేగింపుగా వచ్చారు. అడుగడుగా పార్టీ కార్యకర్తలు పూలు చల్లుతూ, బాణాసంచా కాల్చుతూ, డిజెలతో ఉత్సహంగా పాల్గొన్నారు. నెహ్రూనగర్, బస్టాండ్ సెంటర్, భారీ బత్తాయి, అరటిగెలల పూలదండలతో బ్రహ్మారెడ్డికి స్వాగతం పలికారు. ఆర్అండ్‌బి బంగ్లా వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి, పేదల కడుపు నింపుటానికి పెట్టిన అన్న క్యాంటీన్‌ను బ్రహ్మారెడ్డి ప్రారంభించారు. తరువాత అంబేద్కర్ సెంటర్, కొత్తహాలు సెంటర్, రింగ్‌రోడ్డు వరకు విజయోత్సవ ర్యాలీని కొనసాగించారు. జై తెలుగుదేశం జైజై బ్రహ్మారెడ్డి నినాదాలతో పట్టణం హోరెత్తింది. రోడ్డు మొత్తం పసుపుమయం అయ్యాయి. ర్యాలీలో నాయకులు కుర్రి శివారెడ్డి, విధ్యాధరణి మురళి, నర్రా గురవారెడ్డి, మున్నా రాంబాబు, అన్వర్, మద్దిగపు వెంకట్రామిరెడ్డి, మోసీన్, బాబాఖాన్, మున్నా హనుమంతు పాల్గొన్నారు.


రాయవరం జంక్షన్ వద్ద బ్రహ్మారెడ్డికి స్వాగతం పలుకుతున్న టిడిపి శ్రేణులు